ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
మంగళవారం 22 అక్టోబరు 2024 | 5

డీపీవోగా నాగలత బాధ్యతల స్వీకరణ

రాజమహేంద్రవరం రూరల్ అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) : జిల్లా గ్రామ పంచాయతీ అధికారిగా ఎం.నాగలత సోమవారం బాద్యతలు చేపట్టారు. ఈమె రాజమహేంద్రవరం డీఎల్‌పీవోగా విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు డీజీపీవోగా విధులు నిర్వహించిన శ్రీనివాసరావు మరణించారు. ఈ మేరకు ఆయన స్థానంలో ఈమెకు ఇన్‌చార్జ్ బాద్యతలు ఇస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు.



వాడపల్లి వెంకన్న బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి ఘనంగా ఆరంభమయ్యాయి. పెద్ద ఎత్తున భక్తజనం హాజరై స్వామిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే బండారు సత్యానందం దంపతులు పూజలు చేసి ఉత్సవాలను ప్రారంభించారు. 6

జీతాలివ్వండి.. సమస్యలు పరిష్కరించండి

కలెక్టర్, వైద్యాధికారులకు 108 వైద్యసిబ్బంది వినతి

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : సమస్యలు పరిష్కరించాలని జిల్లాలోని 108 వాహనాల వైద్య సిబ్బంది ఆందోళనకు దిగారు. సోమవారం కలెక్టర్ ప్రశాంతి, డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, జిల్లా ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ డాక్టర్ ప్రియాంకలను కలిసి వినతిపత్రాలు అందజేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఏలూరి నాగ వెంకటరమణ మాట్లాడుతూ సమస్యల పరిష్కరించాలని గతంలో అనేకసార్లు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదన్నారు. సకాలంలో జీతాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రభుత్వం, యాజమాన్యం వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు.మూడు నెలలుగా తమకు జీతాలు చెల్లించడంలేదని, రెండేళ్ల నుంచి ఇంక్రిమెంట్లు వేయకపోవడం, వేతన స్లాబులు అప్‌గ్రేడ్ చేయకపోవడం వల్ల తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గుజ్జాల రమేష్‌బాబు, వర్కింగ్ ప్రెశిడెంట్ జొన్నకూటి నానాజీ, కోశాధికారి జే.వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

అదిగో.. చిరుత!



చిరుత.. సెప్టెంబరు 6వ తేదీన రాజమహేంద్రవరం రిజర్వు ఫారెస్టులో ప్రత్యక్షమైంది.. 24 రోజుల తరువాత రిజర్వు ఫారెస్టు నుంచి వెళ్లి కడియంలో కనిపించింది.. ఆ తరువాత నుంచి అడపాదడపా పుకార్లు షికార్లు చేశాయి.. అయితే ఎక్కడా చిరుత జాడలేదు.. దీంతో అందరిలోనూ ఒకటే అయోమయం.. అసలు చిరుత ఏమైపోయిందనే కలకలం రేగింది.. ఇదిలా ఉండగా ద్వారకాతిరుమల మండలం ఎం.నాగులాపల్లి శివారు అందాలమ్మ చెరువు ప్రాంతంలో సోమవారం ట్రాప్ కెమెరాకు ఒక చిరుత చిక్కింది. ఈ చిరుత తూర్పుగోదావరి నుంచి వెళ్లినదేనా అనే అనుమానం రేకెత్తుతోంది. - వివరాలు 6లో

చీకటి దందాపై సీరియస్

గోకవరం ఘటనపై ఆరా

గోకవరం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) : గోకవరం రెవెన్యూ శాఖలో చీకటి దందా బయటపడడంతో ఏళ్ల తరబడి నుంచి వేలాడుతున్న అవినీతి గబ్బిలాలను తరిమేందుకు రంగం సిద్ధమైనట్లు తెలిసింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి నాయకులతో అంటకాగిన ఆ ఇద్దరు ముగ్గురు గ్రామస్థాయి అధికారులు కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక మళ్లీ అదే తరహాలో టీడీపీ నాయకులను మచ్చిక చేసుకునే ప్రయత్నాలను ఆరంభించారు. గోకవరం మండలం నుంచి బదిలీ కాకుండా ఇదే ప్రాంతంలో ఏదొక గ్రామాన్ని అంటిపెట్టుకొని వేలాడాలనే ప్రయత్నం చేసి సఫలీకృతమయ్యారు.అయితే అక్రమాలకు అడ్డాగా మారిన గోకవరం తహశీల్దార్ కార్యాలయంపై అవినీతి గబ్బిలాలు అంటూ 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం వచ్చిన కథనంతో ఉన్నతాధికారులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఏళ్ల తరబడి పాతుకుపోయిన అధికారుల వివరాలను వెంటనే అందించాలని ఉన్నతాధికారుల నుంచి స్థానిక తహశీల్దారుకు ఆదేశాలు వెలవడినట్టు తెలిసింది. రాత్రి సమయంలో అసలు కార్యాలయంలో ఏం జరుగుతుందంటూ ఇక్కడి అధికారులపై ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. ఆ ఇద్దరు ముగ్గురు గ్రామస్థాయి అధికారులలో ఇద్దరు తాజాగా మరో అక్రమానికి తెరలేపగా కొత్తగా బాధ్యతలు చేపట్టిన మండలస్థాయి అధికారి వాటికి చెక్ పెట్టినట్లు తెలియవచ్చింది.

అయ్యప్ప దీక్ష..పోలీసులకు అనుమతుల్లేవ్

ఎస్పీ నరసింహ కిశోర్

రాజమహేంద్రవరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప/భవానీ దీక్షలకు పోలీస్ సిబ్బందికి అనుమతిలేదని ఎస్పీ నరసింహ కిశోర్ ఉత్తర్వులిచ్చారు. విధుల్లో ఉండే పోలీసులు నిబంధనలను అనుసరించి యూనిఫాం, షూ తదితర నిబంధనలు పాటించాల్సిందేనన్నారు. అయ్యప్ప దీక్ష తీసుకునేవాళ్లు తప్పని సరిగా సెలవుకు అర్జీ పెట్టుకోవాలన్నారు. ఉత్తర్వులను తప్పనిసరిగా అమలు చేయాల్సిందేనని డీఎస్పీలు, కొవ్వూరు ఎస్‌డీపీవో, అందరు ఎస్‌హెచ్‌వోలను ఆదేశించారు. దీక్షల కోసం అనుమతి కోరుతూ ఏ విధమైన వినతులనూ జిల్లా పోలీసు కార్యాలయానికి పంపించవద్దని పేర్కొన్నారు. ఈ ఉత్తర్వులపై సిబ్బంది మనోవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇది కచ్చితంగా హైందవంపై చిన్న చూపేనని, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తక్షణమే కల్పించుకోవాలని విన్నవిస్తున్నారు. జిల్లా పోలీసు సిబ్బందిలో ఇప్పటికే కొందరు అయ్యప్ప దీక్ష తీసుకున్నారు. శబరిమల వెళ్లడానికి అనుమతిస్తారో లేదో తెలియని అగమ్యగోచరంలో వాళ్లు పడిపోయారు.మరి కొందరు మాలధారణకు అనుమతి దొరక్క తీవ్ర మానసిక ఆందోళన చెందుతున్నారు.దీక్ష తీసుకున్నప్పటికీ విధుల సమయంలో యూనిఫాం, టోపీ ధరిస్తున్నామని, కేవలం షూ మాత్రమే ఉండదని, మాలాధారణ చేశామనే సంకేతానికి మేడలో నల్ల టవల్ మాత్రం వేసుకుంటున్నామని గుర్తు చేస్తున్నారు.కేవలం 45 రోజులపాటు మాత్రమే దీక్షకు సంబంధించిన నియమాల్లో ఉంటున్నామన్నారు. వచ్చే నెల 1వ తేదీ నుంచి కార్తీక మాసం వస్తుంది.జ్యోతి దర్శనానికి శమరిమల వెళ్లే వాళ్లు ఆ తేదీల్లోనే మాలధారణ చేస్తారు.వాళ్ల పరిస్థితీ అయోమయంగానే ఉంది. భవానీ దీక్ష ముగిసిన తర్వాత అయ్యప్ప దీక్షా సమయంలో ఇలాంటి ఉత్తర్వులపై విమర్శలు వస్తున్నాయి.



ఏం టీ పని!

యథేచ్ఛగా నకిలీ టీపొడి తయారీ

- బూట్ పాలిష్ పేరుతో నకిలీ టీపొడి
- ప్రజారోగ్యంతో వ్యాపారుల ఆటలు
- జిల్లాలో అనేక చోట్ల తయారీ ప్రక్రియ
- రాష్ట్రంలో అనేక చోట్లకు సరఫరా
- అధికారులు స్పందించాలని డిమాండ్

అనపర్తి అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) : ఛాయ్ మనస్సుకు మందురా భాయ్.. ఈ ఛాయ్ గళాసుకీ జైజై అంటూ ఓ సినీ కవి ఛాయ్‌పై ఓ గీతాన్ని రచించాడు.. దీనిలో టీ వినియోగంపై ఎంత మోజు ఉందో అర్థమవుతుంది. సాధారణంగా కూలీ నుంచి కోటీశ్వరుడి దాకా టీ అంటే ఇష్టపడని వారుండరు. టీ తయారీలో ప్రధానంగా కావలసిన టీపొడి ధరలు మాత్రం సామాన్యుడికి అందుబాటులో లేకపోవడంతో అనేక ప్రాంతాలలో నకిలీ టీ పొడి తయారీ కేంద్రాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. కంపెనీ టీ పొడిని తలదన్నే విధంగా అనేక రసాయనాలను కలిపి విక్రయాలు చేసి ప్రజారోగ్యాన్ని కొల్లగొడుతున్నారు. నిన్న మొన్నటి వరకు నాసి రకం తేయాకును తెచ్చి దానికి కొంచెం కెమికల్స్‌ను గుప్పించి తక్కువ ధరలకు విక్రయాలు సాగించేవారు. ఇటీవల నకిలీ టీ పొడి కొత్త పుంతలు తొక్కింది. జీడిపిక్కలు పొడి, చింత పిక్కల పొడిని తయారు చేసి డికాషన్ వచ్చే విధంగా కెమికల్స్ అద్ది టీ పొడిగా విక్రయాలు సాగించే ముఠాలు పెచ్చు మీరిపోతున్నాయి. జిల్లాలో అనేక చోట్ల గొడౌన్లను అద్దెకు తీసుకుని అక్కడికి చింతపిక్కలు, జీడి పిక్కల పొట్టును తెచ్చి ప్రత్యేకంగా తయారు చేసిన యంత్రాల ద్వారా వీటిని గుండ చేస్తున్నారు. తరువాత గుండను గొడౌన్లలోని కళ్ళంలో ఆరబెట్టి గొడౌన్లలో ఏర్పాటు చేసిన యంత్రాలతో టీపొడిని తయారు చేస్తున్నారు.ఆ పొడిని బస్తాల ద్వారా చిన్న చిన్న టీ పొడి తయారీ కేంద్రాలకు తరలించగా అక్కడ ఈ పొడికి రంగు, రుచి, సువాసన వచ్చే విధంగా మరిన్ని కెమికల్స్‌ను జోడించి వివిధ బ్రాండ్ల పేరుతో తయారు చేసిన కవర్లలో ప్యాకింగ్‌లు చేసి విక్రయాలు సాగిస్తున్నారు. నిర్వాహకులు బూట్ పాలిష్‌కు ముడి సరుకుగా వినియోగించేందుకు ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నామంటూ అధికారులను నమ్మ బలుకుతున్నారు. గతంలో అనపర్తి, బిక్కవోలు మండలాల్లో ఈ తరహా నకిలీ టీ పొడి తయారీపై అధికారులు పెద్ద ఎత్తున తనిఖీలు నిర్వహించారు. దీంతో నిర్వాహకులు తమ దందాను మరో చోటికి మార్చారు. తూర్పుగోదావరి జిల్లాలో అనేక ప్రాంతాల్లో ఈ నకిలీ టీ పొడి తయారీ కేంద్రాలు ఉన్నాయి. జిల్లా యంత్రాంగం దృష్టి సారిస్తే వారి ఆట కట్టించవచ్చని ప్రజలు భావిస్తున్నారు. కల్తీ టీ పొడి భారిన పడి అనేక కుటుంబాలు అనారోగ్యాల భారిన పడి ఆసుపత్రుల పాలవుతున్నారు.. ఒక్కో పరిశ్రమ నుంచి రోజుకు వంద బస్తాల వరకు టీ పొడి తయారు చేయడమే కాకుండా రాష్ట్ర నలుమూలలకు సరఫరా అవుతుంది. నకిలీ టీపొడిని తయారు చేసేందుకు యంత్రాలను వినియోగిస్తున్నారు. జీడి పిక్కల పొట్టు, చింత పిక్కల పౌడర్‌ను యంత్రాల్లో ఆడించి మూడు రకాల పొడులు విడదీసి వాటిని కళ్ళంలో ఆరబెట్టి సంచుల్లో నింపుతున్నాను. ఈ సంచులను రాత్రి సమయాలలో తరలిస్తున్నారు. అయితే ఈ టీపొడి కేజీ 200 నుంచి రూ. 300 వరకు విక్రయాలు సాగిస్తున్నారు. ఇలా రవాణా చేసిన టీపొడి వివిధ ప్యాకింగ్‌ల రూపంలో తయారు చేసి పెద్ద ఎత్తున విక్రయాలు సాగిస్తున్నారు. అనపర్తి పరిసరాల నుండి ఇన్‌స్టాల్‌మెంట్ వ్యాపారం నిర్వహించే అనేక మంది రెండు తెలుగు రాష్ట్రాల్లోను వ్యాపారాలు సాగిస్తుండగా నకిలీ టీ పొడి వ్యాపారులు వీరిని ఆశ్రయించి ఈ టీపొడిని వారి ద్వారా విక్రయాలు సాగిస్తున్నారు.దీంతో ఎవరికి అనుమానం రాకుండా సరుకులు సుదూర ప్రాంతాలకు తరలిపోతున్నాయి. కల్తీ టీపొడిని తయారు చేసే కేంద్రాలపై నిఘా పెట్టి వీటిని అరికట్టకపోతే ఎంతో మంది ఆరోగ్యాలు పాడవుతాయని అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నకిలీ టీ పొడితో జీర్ణకోశ వ్యాధులు



నకిలీ పొడికి వినియోగించే రసాయనాలతో అనేక వ్యాధులు వ్యాపించడమే కాకుండా ప్రాణాంత కంగా కూడా మారతాయి. గ్యాస్ట్రిక్, అల్సర్, గ్యాస్ట్రైటిస్ వ్యాధులతో పాటు కేన్సర్‌కు దారి తీసే అవకాశాలు ఉన్నాయి. ఈ రసాయనాలు క్రమేపి రక్తంలో ప్రవేశించడం ద్వారా లివర్, కిడ్నీలకు సంబంధిత వ్యాదులు వస్తాయి. రక్త హీనత ఏర్పడుతుంది. కంటి చూపు మందగించడం, చెవి, ముక్కు, గొంతుకు సంబంధించిన వ్యాధులు వచ్చే అవకాశాలు ఎక్కు వ. చిన్నారుల్లో ఎదుగుదల క్షీణించడమే కాకుండా అనేక వ్యాధులు వచ్చి జ్ఞాపక శక్తి లోపిస్తుంది. - **డాక్టర్ తాడి రామగు రెడ్డి సూపరిండెంట్ ఏరియా ఆసుపత్రి అనపర్తి**



పోలీస్ అమరవీరులకు నివాళులర్పిస్తున్న సిబ్బంది.. సెల్యూట్ చేస్తున్న కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ నరసింహ కిశోర్, కమిషనర్ కేతన్ గార్గ్ తదితరులు

అమరులకు.. జోహార్లు

ఘనంగా పోలీస్ అమరవీరుల దినం

రాజమహేంద్రవరం,అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): భరతజాతి రక్షణలో ప్రాణాలర్పించిన పోలీసు అమర వీరుల త్యాగాలు చిరస్మరణీయమని కలెక్టర్ ప్రశాంతి పేర్కొన్నారు. భద్రతా పరంగా ఎవరు ఆపదలో ఉన్నా రక్త సంబంధీకుల కంటే ముందుగా స్పందించే వాళ్లు పోలీసులని, ప్రజల రక్షణే పోలీసుల ధ్యేయమని ఎస్పీ నరసింహ కిషోర్ స్పష్టం చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలో సోమవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ దేశ సార్వభౌమాధికారాన్ని, ప్రజాస్వామ్యాన్ని రక్షించడంలో పోలీసులు ప్రదర్శించిన త్యాగాలను స్మరించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అన్నారు. ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఈ ఏడాది దేశవ్యాప్తంగా 214 మంది భద్రతా సిబ్బందిని కోల్పోవడం జరిగిందన్నారు. వీరిలో మన రాష్ట్రానికి చెందిన నరేంద్ర, గణేశ్ ఉన్నారన్నారు. పోలీస్ కుటుంబాల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామన్నారు. కోల్పోయిన ప్రాణాలను తిరిగి తీసుకురావడం సాధ్యం కాదని, కానీ వారి కుటుంబాలకు పోలీస్ శాఖ మొత్తం నిరంతరం అండగా ఉంటుందన్నారు. 11 రోజుల పాటు అమర వీరుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా వారి త్యాగాలను స్మరించుకుంటూ వివిధ కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. దేశ సేవకు పునరంకితమవుదామని పిలుపునిచ్చారు. ప్రకాశంనగర్ పీఎస్‌లో పనిచేస్తూ అనారోగ్యంతో మరణించిన ఏఎస్‌ఐ పి.శ్రీదేవి భర్త శేషు ప్రసాద్‌కి రూ.2.25 లక్షల చెక్కు, అనారోగ్యంతో మృతి చెందిన ఏఆర్ పీసీ శ్రీనివాసరావు భార్య నాగమణికి రూ.1లక్ష చెక్కును కలెక్టర్, ఎస్పీ అందజేశారు. అనంతరం పోలీసు అమర వీరుల స్థూపం వద్ద కలెక్టర్ ప్రశాంతి, జేసీ చిన్న రాముడు, ఎస్పీ నరసింహ కిషోర్, మునిసిపల్ కమిషనర్ కేతన్ గార్గ్, అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బరాజు తదితరులు నివాళులర్పించారు. ఆయా కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.



పీజీఆర్ఎస్‌లో భాగంగా కలెక్టర్‌కు సమస్యలు విన్నవిస్తున్న అర్జీదారులు.. కలెక్టర్ వేదిక ఎదుట కిందనే కూర్చుని ఉన్న దివ్యాంగులు

పీజీఆర్ఎస్‌కు దివ్యాంగుల క్యూ

రూ.15 వేల పెన్షన్‌కు పెద్ద ఎత్తున అర్జీలు

రాజమహేంద్రవరం రూరల్, అక్టోబరు 21 : క్షేత్రస్థాయి సిబ్బంది అంకితభావంతో పనిచేసి సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ పి . ప్రశాంతి ఆదేశించారు. రాజమహేంద్రవరం కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కు 144 అర్జీలు వచ్చాయి. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అర్జీలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే వారం నుంచి అర్జీదారులు నేరుగా సంబంధిత అధికారులను కలిసి అర్జీలు అందజేస్తారన్నారు. సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో రెవెన్యూ శాఖకు 58 ఫిర్యాదులు, పోలీస్ శాఖ 23, పంచాయతీ రాజ్ 16, వ్యవసాయ శాఖ 10, ఇతర శాఖలకు 37 వచ్చాయని ఆన్‌లైన్‌లో 134, ఆఫ్‌లైన్‌లో 10 అర్జీలు స్వీకరించినట్టు తెలిపారు. బొమ్మూరు చెరువుగట్టు వద్ద వాసిరెడ్డి వెంకటేశ్వరావు స్థలంలో ఏర్పాటు చేసిన వైన్ షాపును తొలగించాలని మహిళలు ఫిర్యాదు చేశారు. జాంపేట చేపల మార్కెట్ బయట కొంత మంది అల్లరి చేస్తూ మార్కెట్‌లో తమను వ్యాపారం చేసుకోనివ్వకుండా బయటకు దుకాణాలు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారని బాధిత వ్యాపారులు ఫిర్యాదు చేశారు. ధవళేశ్వరానికి చెందిన కాంట్రాక్టర్ మేకా సత్యనారాయణ పంచాయతీలో చేసిన పనులకు రూ.17 లక్షల బిల్లులు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని వాపోయాడు. బిల్లులు మంజూరు చేయకుంటే ఇక్కడే నిరాహారదీక్షకు అనుమతివ్వాలని కోరారు. పీజీ ఆర్ ఎస్‌కు రూ.15 వేల పెన్షన్‌కు అర్హత కల్పించాలని పెద్ద ఎత్తున దివ్యాంగులు తరలివచ్చారు.

డీపీవోలో గ్రీవెన్స్‌కి 28 అర్జీలు

రాజమహేంద్రవరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్(మీ కోసం)లో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు 28 అర్జీలను సమర్పించారు. వాటిని అడిషనల్ ఎస్పీ(శాంతి భద్రతలు) ఏవీ సుబ్బరాజు, స్వీకరించారు. బాధితుల సమక్షంలోనే సం బంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి తగు ఆదేశాలు ఇచ్చారు. చట్ట పరిధిలో త్వరితగతిన పరిష్కారం చూపాలని సూచించారు.

నీటి సంఘాలకు ఎన్నికలు

- ఈ నెల 31న నోటిఫికేషన్
- వచ్చే నెల 21 నుంచి ఎన్నికలు
- 29న ప్రాజెక్టు కమిటీలతో పూర్తి

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

సీఎం నారా చంద్రబాబునాయుడు మానస పుత్రిక నీటి సంఘాలకు చాలా కాలం తర్వాత ఎన్నికల షెడ్యూల్ జారీ అయింది. 1997లో చంద్రబాబు నీటి సంఘాలను ప్రవేశపెట్టి, సుమారు రూ.5లక్షలలోపు ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ పనులు చేసే హక్కును రైతులకు అప్పగించిన సంగతి తెలిసిందే. గత వైసీపీ ప్రభుత్వం నీటి సంఘాలను పూర్తిగా నిర్వీర్యం చేసింది. చంద్రబాబు నాయకత్వంలో కూటమి అధికారంలోకి రావడంతో మళ్లీ నీటి సంఘాలను తెరమీదకు తెచ్చారు.ఉభయగోదావరి జిల్లాల పరిధిలో 642 నీటి సంఘాలు ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లాలో 113 నీటి యాజమాన్య సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్-1ను జారీ చేసినట్టు జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి తెలిపారు. ముందుగా ఆయా ప్రాంతాల్లో 8 నుంచి 10 మంది వరకూ రైతులు కలిసి ప్రాదేశిక నియోజకవర్గం (టీసీ) సభ్యులను ఎన్నుకుంటారు.వారు నీటి సంఘాల ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్‌ను ఎన్నుకుంటారు. వీరు డిస్ట్రిబ్యూటరీ కమిటీలను ఎన్నుకుంటారు. ఈ కమిటీలన్నీ కలిసి ప్రాజెక్టు కమిటీలను ఎన్నుకుంటారు. వీటి ద్వారా రాజకీయ నిరుద్యోగులకు కొన్ని పదవులు దక్కు తాయి.

1,2 తేదీల్లో అభ్యంతరాల స్వీకరణ

నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్-1ను సోమవారం విడుదల చేశారు. ఈనెల 31న ప్రాదేశిక నియోజకవర్గాల వివరాలు ప్రచురిస్తారు. నవంబరు 1,2 తేదీల్లో అభ్యంతరాలు స్వీకరిస్తారు.3న అభ్యంతరాలపై నిర్ణయం తీసుకుంటారు.అదే రోజు ప్రాదేశిక నియోజకవర్గాల తుది జాబితా ప్రకటిస్తారు. 6 నుంచి 11వ తేదీ వరకూ భూయజమానుల ఓటరు జాబితా తయారు చేస్తారు. 11 నుంచి 12 వరకూ వాటిపై అభ్యంతరాలు స్వీకరిస్తారు. 13న భూయజమానుల తుది ఓటరు జాబితా ప్రకటిస్తారు. 20న ప్రాదేశిక, నీటి సంఘాలు, డిస్ట్రిబ్యూటరీ. ప్రాజెక్టు కమిటీల ఎన్నికల ప్రకటన చేస్తారు. 21 నుంచి 23వ తేదీ వరకూ ప్రాదేశికనియోజకవర్గ సభ్యులు, నీటి యాజమాన్య సంఘాల ఎన్నికలు నిర్వహిస్తారు. 24 నుంచి 26 వరకూ డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నికలు, 27 నుంచి 29వ తేదీ వరకూ ప్రాజెక్టు కమిటీ ఎన్నికలు నిర్వహిస్తారు.

పంచారామాలు, శబరిమలైకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) :పవిత్రకార్తీక మాసాన్ని పురస్కరించుకుని పంచారామాలు, శబరిమలైకు రాజమహేంద్రవరం డిపో నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నామని ఆర్టీసీ జిల్లా అధికారిణి షర్మిలా అశోక తెలిపారు. ఈ మేరకు పోస్టర్లు, బ్యానర్లను సోమవారం ఆవిష్కరించారు. రాజమహేంద్రవరం డిపో మేనేజర్ షేక్ షబ్నం మాట్లాడుతూ కార్తీకమాసంలో ప్రతి ఆదివారం సాయంత్రం 7 గంటలకు రాజమహేంద్రవరం డిపో నుంచి భక్తులతో బయలుదేరతాయన్నారు.పంచారామాల దర్శనం ఉంటుందన్నారు. ఆన్‌లైన్‌లోనూ టిక్కెట్లు రిజర్వేషన్ చేసుకోవచ్చని తెలిపారు. శబరిమలైకు సూపర్ లగ్జరీ, అల్ట్రా డీలక్స్ బస్సులు నడుపుతామని ఒక్కొక్కరికీ 5 రోజుల యాత్రకు రూ.5 వేలు, 7 రోజుల యాత్రకు రూ.6 వేలు, 10 రోజుల యాత్రకు రూ.7,500లు టిక్కెట్ ధరగా నిర్ణయించామన్నారు. యాత్రకు వెళ్లేందుకు ఆసక్తి కల్గిన వారు సెల్ : 99592 25535, 73829 12141, ఎంక్వయిరీ నెం.0883 2468625, రిజర్వేషన్ నెం.99592 25561 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఆర్టీసీ బస్ ఢీకొని దంపతుల మృతి 7

రాజమహేంద్రవరంలో ఓపీకి వెళితే బీపీ!



తుఫాన్.. భయం

రాజానగరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది వరుస తుఫాను ప్రభావ పరిస్థితులతో అధిక వర్షాలు అన్నదాతలను అతలాకుతలం చేస్తున్నాయి.వరి పంట చేతికొచ్చే సమయానికి మేఘ సందేశాలు, తుఫాన్లు హెచ్చరికలు అన్నదాత గుండెల్లో గుబులు పుట్టిస్తున్నాయి. దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు కొట్టుమిట్లాడుతున్నారు.ఇప్పటి వరకూ అప్పులు చేసి పెట్టుబడులు పెట్టిన రైతులకు పంట చేతికొచ్చే సరికి అన్నదాతలు నష్టాలను చవిచూస్తున్నారు.ఓ వైపు వరుణుడి ప్రతాపం, మరో వైపు సాగులో ఖర్చుల భారంతో రైతులు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు యాంత్రీకరణ సాగు చేస్తున్నప్పటికి ప్రకృతి వైపరీత్యాల నుంచి గట్టెక్కలేకపోతున్నారు. దీపావళి సమయానికి మునురు ప్రభావ పరిస్థితుల అనుభవాలను దృష్టిలో పెట్టుకున్న మరికొంత మంది రైతులు వరి పంట కోతకు సిద్ధంగా ఉన్నా వేచిచూస్తున్నారు. రాజానగరం మండలంలో ఈ ఏడాది 100 హెక్టార్లలో వరి సాగు చేయగా కోతలు జరుగుతున్నాయి. ముతక రకాలైన స్వర్ణ, ఎంటీయూ 1318 ఇంకా కోతకు దశకు చేరుకోలేదు.

కొబ్బరి చెట్టుపై పిడుగు



కొవ్వూరు,అక్టోబరు 21 (ఆంధ్ర జ్యోతి) : కొవ్వూరులో పిడుగు పడి కొబ్బరిచెట్టుపై మంటలు ఎగసిపడ్డాయి. 22వ వార్డు పోతురాజు దిబ్బ లో సోమవారం మధ్యాహ్నం కొబ్బరిచెట్టుపై పిడుగు పడింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మం టలను అదుపుచేశారు.

లంకలగన్నవరంలో డొక్కా సీతమ్మ నివాసం




ఆమె స్మృతులు పదిలం!



తరాలు మారినా..చెదరని జ్ఞాపకాలు

అపర అన్నపూర్ణ డొక్కా సీతమ్మ వస్తువులు ఇంకా భద్రంగానే..







సీతమ్మ నివాసంలో భోషాణం.. కావిడి పెట్టెలు.. సీతమ్మ నివాసంలో ఆమె వాడిన చెక్క కుర్చీ

(పి.గన్నవరం- ఆంధ్రజ్యోతి)

నిత్యాన్నదాతగా, అపర అన్నపూర్ణగా ప్రసిద్ధి చెందిన డొక్కా సీతమ్మ జ్ఞాపకాలు ఇంకా పదిలంగానే ఉన్నాయి. ఆమె స్వగ్రామం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం లంకలగన్నవరం గ్రామంలోని ఆమె నివాసంలో నేటికీ సందర్శకులను ఆకర్షిస్తున్నాయి. బ్రిటీషు ప్రభుత్వంతోపాటు ప్రపంచ దేశాల మన్నలను పొందిన సీతమ్మ వాడిన వస్తువులను వందేళ్లు దాటిన ఆమె వంశీయులు ఇంకా అపురూపంగా భద్రపరిచారు. సీతమ్మ జీవిత చరిత్రను గతంలో పలు ప్రభుత్వాలు పాఠ్యాంశాలుగా ముద్రించి విద్యార్థి దశ నుంచే ఆమె సామాజిక సేవను వివరించేవారు. రానురాను సీతమ్మ చరిత్రను పాఠ్య పుస్తకాల్లో తొలగించారు. ఈ తరుణంలో ఇటీవలే ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో సీతమ్మ పేరు చిరస్థాయిగా నిలిచి ఉండేలా మధ్యాహ్న భోజన పథకానికి డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం పేరును సూచించి పెద్దపీట వేశారు. అయితే ఆ రోజుల్లో ఆకలి అని వచ్చిన వారికి వండి వడ్డించిన సీతమ్మ వాడిన పెద్ద పెద్ద వంట పాత్రలను గణపతి మందిరాలు, సత్రాలకు అందించారని ప్రస్తుతం ఉన్న ఐదవ తరం వారసులు చెప్పుకొచ్చారు. ఆమె నివాసంలో ప్రస్తుతం చెక్కతో చేసిన భోషాణం ఇప్పటికీ చెక్కుచెదరకుండా అలాగే ఉంది. ఆరోజుల్లో ఆ భోషాణంలో పాత్రలు, వంటసామగ్రి తదితర వస్తువులను సీతమ్మ భద్రపరుచుకునేవారు. అలాగే సీతమ్మ వాడిన కావిడి పెట్టెలు ఇప్పటికీ అలాగే ఉన్నాయి. వీటిలో ముఖ్యంగా బంగారం నగలు, నగదు, ముఖ్యమైన వస్తువులతోపాటు చీరలను సైతం వాటిలో భద్రపరుచుకునేవారట. ఇంకా వంట నిమిత్తం వినియోగించిన సన్నికాలు, రుబ్బురోలు కూడా అలాగే ఉన్నాయి. అంతేకాకుండా సీతమ్మ చివరి రోజుల్లో ఎక్కువగా కూర్చున్న కుర్చీతోపాటు తాగు నీరుకు వినియోగించిన నుయ్యి సైతం పెరట్లో అలాగే ఉన్నాయి. కాగా సీతమ్మ నివాసానికి వెళ్లే రహదారిని అభివృద్ధి చేసి పర్యాటకులకు అందుబాటులో ఉంచితే బాగుంటుంది.





డొక్కా సీతమ్మ నివాసంలో నుయ్యి.. సీతమ్మ వాడిన రుబ్బురోలు





విద్యుత్ వెలుగులతో ఊరేగుతున్న రథం వాహనాలు

వేములవాడలో ఘనంగా దసరా సంబరం

- రథం వాహనాల ఊరేగింపు
- కన్నుల పండువగా జ్వాలాతోరణం

కరప, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కరప మండలం వేములవాడ గ్రామంలో సోమవారం రాత్రి దసరా సంబరం ఘనంగా జరిగింది. గ్రామంలోని మెరకవీధి, పల్లపువీధి రామాలయాల పెద్దలు ఏటా ఈ సంబరాన్ని అత్యంత వైభవంగా నిర్వహించడం ఆనవాయితీ వస్తోంది. ఇరు ఆలయ కమిటీల నేతృత్వంలో రంగురంగుల విద్యుత్ కాంతులతో ముస్తాబు చేసిన రథం వాహనాలను రాత్రి తెల్లవార్లూ గ్రామమంతా ఊరేగించారు. ఈ రథం వాహనాల ముందు బ్యాండ్‌మేళాలు, కోయడాన్స్‌లు, డీజే, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటుచేసి సంబరాన్ని విజయవంతం చేశారు. అంతకుముందు ఆయా ఆలయాల వద్ద నిర్వహించిన జ్వాలాతోరణం కన్నుల పండువగా జరిగింది. పొడవాటి దేవదారు కర్రలతో నిర్మించిన భారీ ఆర్చి నుంచి విద్యుత్ వెలుగులతో శోభాయమానంగా తీర్చిదిద్దిన రథాలను తీసుకెళ్లి సంబరాన్ని ప్రారంభించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భారీగా జనం వెళ్లి ఈ సంబరాన్ని వీక్షించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా కరప ఎస్ఐ తోట సునీత ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.





వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో కొలువుతీరిన ఉత్సవమూర్తులు... (పక్కన) హాజరైన భక్తులు



వాడపల్లి వెంకన్న బ్రహ్మోత్సవాలకు శ్రీకారం

- ధ్వజారోహణంతో ఉత్సవాలకు అంకురార్పణ
- శేషవాహనంపై విహరించిన శ్రీవారు
- విద్యుత్ వెలుగులు, పుష్పాలంకరణలతో సరికొత్త శోభ
- తొలిరోజు బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు



ఉత్సవాల ప్రారంభ సూచికగా ధ్వజపతాకం

ఆత్రేయపురం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి 12వ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. విద్యుత్ దీపాలంకరణ, సుంగధ పరిమళాలు వెదజల్లే వేద పండితుల మంత్రోచ్ఛరణ, కళాకారుల ప్రదర్శనలు, భక్తజన గోవిందనామస్మరణల నడుమ వాడపల్లి పులకించింది. వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం తొలిరోజు బ్రహ్మోత్సవాల్లో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు- కమలరాణి చేతులు మీదుగా బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం ఖండవిల్లి రాజేశ్వరవరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేదపండితులు, అర్చక బృందం, బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించారు. స్వస్తివచనము, విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనము, దీక్షాధారణ, కల్మసహోమము, అగ్ని ప్రతిష్ఠాపన తదితర కార్యక్రమాలను రమణీయంగా నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో అలంకరించిన వసంత మండపంలో స్వామివారు ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు- కమలరాణి దంపతులు ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు-కనకదుర్గాదేవి దంపతులు పూజా మహోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం సాయంత్రం ధ్వజారోహణం నిర్వహించి అంకురార్పణ చేశారు. ధ్వజపీఠం వద్ద వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రకార మండపం, ఆలవార్ల మండపంలో పుష్పాలంకరణ విశేషంగా ఆకట్టుకుంది. విద్యుద్దీపాలంకరణలు భక్తులను మంత్రముగ్ధులను చేశాయి. పుష్పాలతో అలంకరించిన వేంకటేశ్వర స్వామి, తిరునామాలతో ఫొటోషూట్‌లు నిర్వహించారు. అనంతరం రాత్రి యాగశాలలో హోమాలు నిర్వహించారు. ధ్వజస్తంభం బలి పీఠం వద్ద ఉత్సవమూర్తులు కొలువుతీరారు. ధ్వజపటాన్ని ఊరేగిస్తూ దేవతలను ఆహ్వానించారు. ధ్వజస్తంభంలో ప్రతిష్ఠించిన గరుడికి పూజలు నిర్వహించి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. కేరళ, తెలంగాణకు చెందిన వాయిద్య కళాకారుల ప్రదర్శనలు అమితంగా ఆకట్టుకున్నాయి. అనంతరం రాత్రి శ్రీవారు పరావాసుదేవ అలంకరణలో అలంకృతుడై శేషవాహనంపై కొలువుతీరారు. విద్యుత్ వెలుగులు, మేళతాళ మంగళవాయిద్యాలు, వేదఘోష, బాణసంచా కాల్పుల నడుమ శ్రీవారు తిరుమాడవీథులలో అశేష భక్తజన గోవిందనామస్మరణ నడుమ విహరించారు. అశేష భక్తజనం బ్రహ్మోత్సవాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించిన తన్మయత్వం పొందారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో ముదునూరి వెంకట్రాజు- సత్యశ్రావణి దంపతులు, సర్పంచ్ కాయల జగన్నాథం, పలువురు ప్రముఖులతో పాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.

నేడు వాడపల్లిలో....

శ్రీవారి బ్రహ్మోత్సవాలలో భాగంగా రెండవ రోజు మంగళవారం అష్టదళ పాదపద్మారాధన, సరస్వతి అలంకరణలో హంస వాహనంపై శ్రీవారి వాహన సేవ నిర్వహిస్తారు.

జిల్లా స్థాయి పోటీల్లో చెందుర్తి విద్యార్థుల ప్రతిభ

గొల్లప్రోలు రూరల్, అక్టోబరు 21(ఆంధ్ర జ్యోతి): జిల్లాస్థాయిలో జరిగిన సైన్స్ ప్రయోగాలు, గణితం క్విజ్ పోటీల్లో గొల్లప్రోలు మండలం చెందుర్తి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరచి బహుమతులు సాధించారు. క్రియా సంస్థ, అల్లం రాజు చారిటబుల్ ట్రస్టు సైన్స్ సెంటర్ సంయుక్తంగా పెద్దాపురంలో నిర్వహించిన పోటీల్లో పాఠశాల 5,6వ తరగతుల విద్యార్థులు జగ్గారపు భాగ్యలక్ష్మి, పలివెల గౌతమి వెంకటలక్ష్మి పది రూపాయిలతో మైక్రోస్కోప్ తయారుచేసి ప్రదర్శించారు. దీనికిగాను నగదు పురస్కారం, మెమో ంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. విద్యార్థులు, శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయుడు పిల్లి గోవిందరాజులను ఎంఈవోలు వెంకటేశ్వరరావు, శివప్రసాద్, హెచ్‌ఎం సావిత్రి, విద్యాకమిటీ చైర్మన్ జగ్గారపు శ్రీనివాస్‌లు అభినందించారు.



బహుమతులు అందిస్తున్న దృశ్యం

వివిధ క్రీడల్లో జిల్లా స్థాయి ఎంపికలు

కాకినాడ అర్బన్, అక్టోబరు 21: పాఠశాల విద్య జిల్లాశాఖ ఆధ్వర్యంలో వివిధ క్రీడల్లో జిల్లాస్థాయి క్రీడాకారులను సోమవారం డీఎస్‌ఏ ప్రాంగణంలో ఎంపిక చేసినట్టు కార్యదర్శి లంకా జార్జి తెలిపారు. అండర్-14 టెన్నిస్, అండర్-17 బాక్సింగ్, అండర్ అండర్-14, 17 సైక్లింగ్ క్రీడాకారులను రాష్ట్రస్థాయి జట్లకు ఎంపిక చేశామన్నారు. అండర్-17, 19 టెన్నిస్‌లో ఎంపికలు మంగళవారం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో డీఎస్‌ఏ సీఈవో బి.శ్రీనివాసకుమార్, టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి రామ్‌కుమార్ ఎస్‌జీఎఫ్ అసిస్టెంట్ కార్యదర్శులు సునీల్‌కుమార్, పరుశరాం పీడీలు పాల్గొన్నారు.



ఎం.నాగులపల్లి శివారు అందాలమ్మ చెరువు ప్రాంతంలో ట్రాప్ కెమెరాకు చిక్కిన చిరుత

అదిగో చిరుత!

- ట్రాప్ కెమెరాకు చిక్కిన చిరుత
- బోన్లు ఏర్పాటు చేసిన అటవీశాఖ అధికారులు
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ హెచ్చరికలు



చిరుత తిరిగిన పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

ద్వారకాతిరుమల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎం.నాగులపల్లి శివారులో రెండురోజుల క్రితం కన్పించి ప్రజలను బెంబేలెత్తించిన చిరుత.. ఫారెస్ట్ అధికారులు ఏర్పాటు చేసిన ట్రాప్ కెమెరాకు చిక్కింది. అది ఆ పరిసర ప్రాంతాల్లోనే మకాం వేసినట్టు అనుమానిస్తున్నారు. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. సోమవారం ఉదయం ట్రాప్ కెమెరాలో చిరుత సంచారం నమోదు కావడంతో దానిని పట్టుకునేందుకు ప్రత్యేక బోన్లు ఏర్పాటు చేశారు. పరిసర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే చిరుత సంచారాన్ని ఖరారు చేసేందుకు ఆ ప్రాంతంలో దొరికిన దాని పాదముద్రలను ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ వినియోగించి నమూనాలను తయారు చేశారు. వీటిని ల్యాబ్‌లో పరిశీలించేందుకు అటవీ శాఖ రేంజర్ రాజమండ్రికి పంపారు. ఈ క్రమంలోనే ట్రాప్ కెమెరాకు చిరుత సంచారం జాడ కన్పించడంతో అప్రమత్తమైన జిల్లా అటవీ శాఖ అధికారి ఆశాకిరణ్ సోమవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ట్రాప్ కెమెరాలను అదనంగా మరో రెండు కెమేరాలను చిరుత జాడ కన్పించిన అందాలమ్మ చెరువు ప్రాంతంలో ఏర్పాటు చేశారు.



చిరుతను పట్టుకునేందుకు బోనులు అమర్చుతున్న అధికారులు



జేఎన్‌టీయూకేలో జరిగిన కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఉపకులపతి కేవీఎస్‌జీ మురళీకృష్ణ

మానవ జీవితంలో ఆహారం అత్యంత అవసరం

- ఉపకులపతి కేవీఎస్‌జీ మురళీకృష్ణ
- జేఎన్‌టీయూకేలో ఆహార దినోత్సవం

జేఎన్టీయూకే, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మానవ జీవితంలో ఆహారం అత్యంత అవసరమైందని జేఎన్టీయూకే ఇన్‌చార్జి ఉపకులపతి ప్రొఫెసర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ అన్నారు. జేఎన్‌టీయూకేలోని అలూమ్నీ ఆడిటోరియంలో స్కూల్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ, అసోషియేషన్ ఆఫ్ ఫుడ్ సైంటిస్ట్స్ టెక్నాలజిస్ట్స్ ఇండియా(ఏఎఫ్‌ఎస్టీఐ) కాకినాడ ఛాప్టర్ సంయుక్త ఆధ్వర్యంలో 'మెరుగైన జీవితం, మంచి భవిష్యత్ కోసం ఆహార హక్కు' నినాదంతో ప్రపంచ ఆహార దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్కూల్‌ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ మాలోతు రమేష్ అధ్యక్షత వహించగా వీసీ మురళీకృష్ణ ముఖ్యఅతిథిగాను, విశిష్ట అతిథిగా విశాఖపట్నంలోని సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ (సీఐఎఫ్‌టీ) ఎమిరిటస్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.ముక్తేశ్వర్‌ప్రసాద్, గౌరవ అతిథులుగా రెక్టార్ కేవీ రమణ, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ వి.రవీంద్రనాథ్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వీసీ మాట్లాడుతూ ఆహారంతోనే జీవన మనుగడ సాగుతుందని, ఫుడ్ ఇంజనీరింగ్ విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉందన్నారు. స్కూల్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ విభాగంలోని లేబొరేటరీలో ఆహార పదార్థాలను పరీక్షించేందుకు అత్యాధునిక టెస్టింగ్ సదుపాయాలున్నాయన్నారు. దీన్ని వినియోగించుకుంటే ప్రభుత్వపరంగా బాగుంటుందన్నారు. అనంతరం ముక్తేశ్వర్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి మనిషి తన జీవితంలో 35 టన్నుల ఆహారాన్ని తీసుకుంటారన్నారు. ప్రపంచంలో ఏటా అత్యధికంగా ఆహారాన్ని వృథా చేస్తున్నారని ప్రజలు ఆకలితో అలమటించకుండా చూడాల్సిన బాధ్యత ఫుడ్ ఇంజనీరింగ్ విద్యార్థులపై ఉందని తెలిపారు. రెక్టార్ కేవీ రమణ మాట్లాడుతూ ఆహారానికి ఎంత ప్రాధాన్యమిస్తామో నీటికి అంతే ప్రాధాన్యమివ్వాలన్నారు. ఈ సందర్భంగా పలు క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసీ డైరెక్టర్ ఎంహెచ్‌ఎం కృష్ణప్రసాద్, ఏఎఫ్‌ఎస్టీఐ కాకినాడ ఛాప్టర్ కార్యదర్శి ఎం.చంద్రిక, జేఎన్టీయూకే, అక్నూ అనుబంధ, ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

జిమ్నాస్టిక్స్‌లో సత్తా చాటిన క్రీడాకారులు



కాకినాడఅర్బన్, అక్టోబరు21: గుంటూరులో ఈనెల 17 నుంచి 19 వరకు జరిగిన రాష్ట్ర జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్‌లో కాకినాడ క్రీడాప్రాధికార సంస్థలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు అండర్-10,11,12 విభాగాల్లో 46 పతకాలు సాధించారు. 17 బంగారు, 15 రజతం, 14 కాంస్య పతకాలు వీటిలో ఉన్నాయి. అండర్-12 విభాగంలో చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం క్రీడాకారులను శిక్షకుడు సురేష్‌ను డీఎస్‌ఏ సీఈవో బి.శ్రీనివాసకుమార్, జిమ్నాస్టిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బి.విశ్వేశ్వరరావు ఉపాధ్యక్షుడు ఎం.చిన్న అభినందించారు. క్రీడాకారుల్లో కొందరు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని కోచ్ సురేష్ తెలిపారు.


ఈవోకు విరాళం అందిస్తున్న ప్రదీప్‌కుమార్

భావనారాయణ స్వామి ఆలయ అభివృద్ధికి రూ.4.50 లక్షల విరాళం

సర్పవరం జంక్షన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సర్పవరంలోని శ్రీరాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామి ఆలయ అభివృద్ధికి యామ్ గ్రీన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధి ప్రదీప్‌కుమార్ రూ.4.50 లక్షల చెక్కును ఈవో (గ్రేడ్-1) మాచిరాజు లక్ష్మీనారాయణకు సోమవారం అందజేశారు. ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ అనిల్‌కుమార్‌కు ఈవో కృతజ్ఞతలు తెలిపారు. భావనారాయణస్వామి ఆలయంలోని హుండీలను దేవదాయ శాఖ తనిఖీదారు ఫణీంద్రకుమార్ ఆధ్వర్యంలో సోమవారం తెరిచి లెక్కించగా రూ.3,52,145 ఆదాయం లభించినట్టు ఈవో లక్ష్మీనారాయణ తెలిపారు. లెక్కింపులో ఆలయ మాజీ చైర్మన్ పుల్ల శ్రీను, గ్రామ పెద్దలు పుల్ల శ్రీరాములు, ముద్దన సూర్యప్రకాశరావు, పోలీసులు, రెవెన్యూ అధికారులు, సేవాదళ్ కార్యకర్తలు, అర్చకులు పాల్గొన్నారు.

16 మంది మృతికి కారణమైన

లారీ డ్రైవర్‌కు పదేళ్ల జైలు శిక్ష

పెద్దాపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి వద్ద 2015లో జరిగిన లారీ ప్రమాద ఘటనకు సంబంధించిన కేసులో 16 మంది మృతికి కారణమైన ఓ లారీ డ్రైవర్‌కు 10 సంవత్సరాలు జైలు శిక్ష విధిస్తూ పెద్దాపురం సీనియర్ సివిల్ జడ్జి, అసిస్టెంట్ సెషన్స్ జడ్జి డాక్టర్ దీపా దైవకృప సోమవారం తీర్పు వెలువరించారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాగం కామేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. 2015 సెప్టెంబరు 14న గండేపల్లి జాతీయ రహదారిపై జరిగిన ఘోర ప్రమాదంలో 16 మంది మృతి చెందారు. 10 మంది తీవ్రంగా గాయపడ్డారు. దీనిపై అప్పటి గండేపల్లి ఎస్ఐ ఎన్.రజనీకుమార్ కేసు నమోదు చేశారు. వాదోపవాదాలు జరిపి 77 మంది సాక్షులను విచారించిన అనంతరం తీర్పు ఇచ్చారు. లారీ డ్రైవర్ జోగా శ్రీనుకు 10 సంవత్సరాలు జైలు, పాటు రూ.10 వేలు జరిమానా, క్లీనర్ బుట్ట లోవరాజుకు ఒక సంవత్సరం జైలు, రూ.వెయ్యి జరిమానా విధించారు.


ఇరుసుమండలో ఆనందరామేశ్వర స్వామిని దర్శించుకుంటున్న రామలింగేశ్వరరావు

ఏకాదశ రుద్రులపై పాట రాస్తా

ప్రముఖ సినీ గేయ రచయిత, కవి జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు

అంబాజీపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కోనసీమలో కొలువైన ఏకాదశ రుద్రులపై మంచి పాట రాస్తానని ప్రముఖ సినీ గేయ రచయిత, కవి జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం ఆయన డాక్టర్ బార్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అయినవిల్లి శ్రీసిద్ధివినాయకుడిని దర్శించుకున్నారు. అనంతరం అయినవిల్లి, అంబాజీపేట, అమలాపురం రూరల్ మండలాల్లోని పలు ఆలయాలను సందర్శించారు. అయినవిల్లి ఆలయ ఈవో ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఏకాదశ రుద్రులను సందర్శించారు. ఒక్కరోజే ఇలా దర్శించుకోవడాన్ని పూర్వజన్మసుకృతంగా భావిస్తున్నానన్నారు. కోనసీమలోని వాడపల్లి, అయినవిల్లి, అప్పనపల్లి ఆలయాలపై పాటలు రచించానన్నారు. ఇప్పటివరకు 600కిపైగా పాటలు రాసినట్టు చెప్పారు. నేదునూరు, వక్కలంక, ముక్కామల, వక్కలంక, ఇరుసుమండ, పుల్లేటికుర్రు, వ్యాఘ్రేశ్వరం, కె.పెదపూడి, మొసలపల్లి, గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం, పాలగుమ్మి గ్రామాల్లో కొలువుదీరిన ఏకాదశ రుద్రులను దర్శించి అక్కడి భక్తులతో మాట్లాడారు. ఖ్యాతిగాంచిన జగ్గన్నతోట ప్రభల తీర్థం విశేషాలను తెలుసుకున్నారు.

అర్చకుల మధ్య సమసిన వివాదం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కొత్తపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి ఉప్పాడలో ఇద్దరు అర్చకుల మధ్య తలెత్తిన వివాదం దేవదాయ, ధర్మాదాయ శాఖ అధికారుల జోక్యంతో సద్దుమణిగింది. ఉప్పాడలో శ్రీచాడేశ్వరీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయ అర్చకుల మధ్య వివాదం కారణంగా ఆలయానికి తాళాలు వేయడంతో భక్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై 'ఓ స్వామీ..నీ సేవ చేసే భాగ్యం ఎవరిదో' శీర్షికన ఆంధ్రజ్యోతిలో సోమవారం వచ్చిన కథనానికి దేవదాయ, ధర్మాదాయ శాఖ ఉన్నతాధికారులు స్పందించారు. దేవదాయ శాఖ జిల్లా అధికారి దుర్గాభవాని, ఇన్‌స్పెక్టర్ ఫణీంద్రకుమార్ ఆధ్వర్యంలో సోమవారం ఉప్పాడలో విచారణ చేపట్టారు. అర్చకుడు కప్పగంతుల రవితేజ, గతంలో పని చేసిన అర్చకుడు రమేష్‌లను విచారించారు. వ్యక్తిగత కారణాలతో వివాదం జరిగిందని, ఫలితంగా ఆలయానికి తాళం వేసినట్టు అధికారులు గుర్తించారు. భక్తుల మనోభావాలు దెబ్బతినేలా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇటువంటి చర్యలు పునరావృతమైతే చర్యలు తప్పవన్నారు. స్వామివారి కైంకర్యాలను నిర్వహిస్తున్న అర్చకుడే ఎప్పటిలాగానే పూజలు చేస్తారని అధికారులు తెలియజేశారు. సక్రమంగా విధులు నిర్వర్తించాలని, ఆలయ ప్రతిష్ఠకు భంగం వాటిల్లేలా ప్రవర్తించొద్దని ఆదేశించారు. విచారణలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

సత్య రథంతో సత్యదేవుడి గిరి ప్రదక్షిణ

కార్తీక పౌర్ణమి రోజున మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభం



అన్నవరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది కార్తీక పౌర్ణమి రోజున సత్యదేవుడి గిరి ప్రదక్షిణ సత్య రథంతో మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభమవుతుందని అన్నవరం దేవస్థానం అధికారులు సోమవారం వెల్లడించారు. ఇప్పటిదాకా ఉదయం ఏడు గంటలకు ముందు పల్లకిలో స్వామి, అమ్మవార్లను ఉంచి తర్వాత సత్యరథంతో రత్నగిరి, సత్యగిరి చుట్టూ ప్రదక్షిణ చేసేవారు. కార్తీక పౌర్ణమి వేళ స్వామివారి సన్నిధికి చేరుకున్న భక్తులు, గిరిప్రదక్షిణలో పాల్గొనే లక్షలాది మందితో తోపులాట, ఇతర ఇబ్బందులు ఎదురయ్యేవి. ఈ నేపథ్యంలో అధికారులు వైదిక కమిటీ అభిప్రాయం తీసుకుంది. ఉదయం పల్లకిలో స్వామి, అమ్మవార్లను ఊరేగించి, మధ్యాహ్నం రెండు గంటలకు సత్యరథంతో ప్రదక్షిణ చేయించాలని నిర్ణయించారు. సింహాచలం దేవస్థానంలో ఈ విధానం ఇప్పటికే అమలవుతోందని వెల్లడించారు. అయితే భక్తులు సావకాశాన్ని బట్టి రెండింటిలోనూ పాల్గొనవచ్చన్నారు. కాగా ఈ నిర్ణయంపై భక్తులు, గ్రామస్తుల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సత్య రథం ఊరేగింపును మధ్యాహ్నం ప్రారంభించినా ఎండవేడి, కార్తీక పౌర్ణమి ఉపవాసాల నేపథ్యంలో అధిక సంఖ్యలో భక్తులు ఉదయం పల్లకితో పాటు గిరిప్రదక్షిణలో పాల్గొనే అవకాశం ఉంది. ఇంజనీరింగ్, ఆలయ, పీఆర్వో విభాగ అధికారులు సంబంధిత ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

కార్తీక మాసోత్సవ కార్యక్రమాల వివరాలను దేవస్థానం విడుదల చేసింది. కార్తీకమాస ప్రారంభాన్ని పురస్కరించుకుని నవంబరు 1న ఆకాశ దీపం, 13న సత్యజ్యోతి ఊరేగింపు, రాత్రి 7 గంటలకు తెప్పోత్సవం, 15వ తేదీ మధ్యాహ్నం సత్యరథంతో గిరిప్రదక్షణ, సాయంత్రం పంపా హారతులు, రాత్రి ఏడు గంటలకు జ్వాలాతోరణం, 22వన సత్యదీక్షాపరులతో పడిపూజ, 23న సత్యదీక్షల విరమణ, 29న జ్యోతిర్లింగార్చన.

వేటకు వెళ్లిన మత్స్యకారుడు గల్లంతు

అంతర్వేది, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేదిపల్లిపాలెంలో సోమవారం తెల్లవారుజామున వేటకు వెళ్తూ మత్స్యకారుడు గల్లంతయ్యాడు. నక్కపల్లి నియోజకవర్గం రాజానగరానికి చెందిన బొంది నూకయ్య (50) దినచర్యలో భాగంగా వేటకు బయలుదేరి బోటు చివరన కూర్చున్నాడు. కెరటాల తాకిడికి ఒక్కసారిగా గోదావరిలో పడిపోయాడు. వెంటనే బోట్లు రావడంతో నూకయ్య ఆచూకీ తెలియలేదని అతడితో వేటకు వెళ్లిన నలుగురు మత్స్యకారులు స్థానికులకు తెలిపారు. నూకయ్యకు భార్య, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. నూకయ్య ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ దుర్గాశ్రీనివాస్ చెప్పారు.

రైఫిల్ షూటింగ్ పిస్టల్ విభాగంలో

ఆల్‌రౌండ్ చాంపియన్ 'తూర్పు'


ప్రథమ బహుమతి అందుకుంటున్న తూర్పు గోదావరి జట్టు సభ్యులు

దివాన్‌చెరువు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఏపీ అంతర్ జిల్లాల రైఫిల్ షూటింగ్ టోర్నమెంట్‌లో పిస్టల్ వ్యక్తిగత విభాగంలో తూర్పు గోదావరి జట్టు ఆల్‌రౌండ్ చాంపియన్‌గా నిలిచిందని తూర్పు గోదావరి జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి ఎస్ఆర్‌కేవీ స్వామి తెలిపారు. ఏపీ పాఠశాల విద్యాశాఖ, క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం సంపత్‌నగరంలోని రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూలులో జరిగిన అంతర్ జిల్లాల రైఫిల్ షూటింగ్ టోర్నమెంట్‌లో పిస్టల్ కేటగిరీలో విజేతల వివరాలను స్వామి సోమవారం విలేకరులకు వివరించారు.

అండర్-14 బాలికల విభాగంలో తూర్పు గోదావరి జిల్లాకుచెందిన ఎస్.దీక్షిత (ప్రథమ), టీకే ఆకృతి (ద్వితీయ), అనంతపురం జిల్లాకు చెందిన పి.ధాత్రి (తృతీయ) స్థానాల్లో నిలిచారు. అండర్-14 బాలురు విభాగంలో కృష్ణా జిల్లాకు చెందిన కె.అభిలాష్‌చంద్ర (ప్రథమ), తూర్పు గోదావరి జిల్లాకు చెందిన జి.చంద్రహాస్ (ద్వితీయ), గుంటూరు జిల్లాకు చెందిన టి.సేతు మాధవ (తృతీయ) స్థానాల్లో నిలిచారు.

అండర్-17 బాలికల విభాగంలో విశాఖపట్టణం జిల్లాకు చెందిన ఎస్.నిష్ఠవైదుషి (ప్రథమ), గుంటూరు జిల్లాకు చెందిన వై.రాజరాజేశ్వరి (ద్వితీయ), విశాఖపట్టణం జిల్లాకు త్రిషవర్మ (తృతీయ) స్థానాల్లో నిలిచారు. అండర్-17 బాలుర విభాగంలో తూర్పు గోదావరి జిల్లాకు చెందిన జి.సూర్యప్రణవ్ (ప్రథమ), కృష్ణా జిల్లాకు చెందిన ఎస్.జహీర్ అలీ (ద్వితీయ), కర్నూలు జిల్లాకు చెందిన బి.హృషీకేశ్‌రెడ్డి (తృతీయ) స్థానాల్లో నిలిచారు.

అండర్-19 బాలికల విభాగంలో వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన ఎస్‌డీ మహి జమీన్ (ప్రథమ), కర్నూలు జిల్లాకు చెందిన ఎం.పల్లవి (ద్వితీయ), అనంతపురం జిల్లాకు చెందిన ఎం.మల్లికాభాయ్ (తృతీయ) స్థానాల్లో నిలిచారు. అండర్-19బాలురు విభాగంలో ఏపీ సూర్యరామ సంజయ్‌రెడ్డి (ప్రథమ), అనంతపురం జిల్లాకు చెందిన టి.వెంకటఅఖిల్ (ద్వితీయ), తూర్పు గోదావరి జిల్లాకు చెందిన ఎస్.దత్తసాయితేజ (తృతీయ) స్థానాల్లో నిలిచారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

అన్నవరం రైల్వే స్టేషన్లో గుర్తు తెలియని వ్యక్తి మృతి



తుని రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అన్నవరం రైల్వే స్టేషను ఒకటో నెంబరు ప్లాట్‌ఫామ్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు తుని రైల్వే పోలీసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత వ్యక్తి అనారోగ్యంతో మరణించి ఉంటాడని, అతని వయసు 35 నుంచి 40 సంవత్సరాలు ఉండొచ్చని భావిస్తున్నారు. నీలం రంగు టీ షర్టు, ముక్కుపొడి రంగు ప్యాంటు ధరించి వున్నాడు. ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో కేసు నమోదు చేసిన రైల్వే పోలీసులు మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి సంబంధికులు ఎవరైనా ఉంటే తుని రైల్వే పోలీసులను గానీ, 94906 19020 నెంబర్లో గానీ సంప్రదించాలని ఎస్ఐ జి.శ్రీనివాసరావు కోరారు.


ఓపీ విభాగంలో రిజిస్ట్రేషన్ కోసం గంటల తరబడి నిలుచున్న రోగులు, వారి సహాయకులు



'ఓపీ'కి వెళ్తే బీపీ!

సర్వర్ డౌన్ అంటూ రిజిస్ట్రేషన్ చేయడంలో జాప్యం

సిబ్బంది పనితీరుపై రోగులు, వారి సహాయకుల ఆగ్రహం

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం జీజీహెచ్ ఓపీ (అవుట్ పేషెంట్) విభాగం దారుణంగా తయారైంది. తమకు బీపీ లేకపోయినా అక్కడున్న వారు బీపీ తెప్పిస్తున్నారని వైద్యం కోసం ఆసుపత్రికి వచ్చిన రోగులు, వారి సహాయకులు చెప్తున్నారు. అంతలా ఉంది ఇక్కడ పనిచేస్తున్న వైద్య సిబ్బంది పనితీరు. ప్రధానంగా ఓపీ రిజిస్ట్రేషనుకు సంబంధించి ఆసుపత్రి అధికారులు రోగులకు నరకం చూపిస్తున్నారనే భావన అందరిలోనూ వ్యక్తమవుతోంది. సోమవారం ఓపీ విభాగం వద్ద ఇలాంటి పరిస్థితే కనిపించింది. సర్వర్ డౌన్ అయ్యిందని, సిగ్నల్ లేదని, నెట్‌వర్క్ సరిగా పని చేయట్లేదని కుంటిసాకులు చెప్పడంతో రిజిస్ట్రేషన్ చేసే సిబ్బందితో పలువురు రోగులు, వారి సహాయకులు వాగ్వాదానికి దిగారు. తాము ఉదయం పది గంటలకు వస్తే మధ్యాహ్నం పన్నెండు గంటలైనా తమకు ఓపీ చీటీ రాయలేదని, మధ్యాహ్నం వెళితే డాక్టర్లు ఉంటారా అంటూ పలువురు మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఆధార్ నెంబరుతో రిజిస్ట్రేషన్ చేస్తేనే సెల్‌ఫోన్‌కు ఓటీపీ వస్తుంది. ఆ ఓటీపీ నెంబరు చెబితేనే కంప్యూటర్ ఓపీ స్లిప్ ఇస్తారు. ఈ ప్రక్రియకు గంటల సమయం లైన్‌లో నిలుచోవాల్సి రావడంతో రోగులు,వారి సహాయకులకు ప్రాణం పోయినంత పనవుతోంది. ఓపీ నమోదు సమయంలో రోగులకు అసౌకర్యం లేకుండా చూడాలని సిటీ ఎమ్మెల్యే పదేపదే చెప్పినా, ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆదేశాలిచ్చినా వీళ్లింతే ... మారరు అన్నట్టుగా ఓపీ సిబ్బంది ఉన్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

'పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధిక మెజార్టీ సాధించాలి'

కొవ్వూరు, అక్టోబరు 21 (ఆంధజ్యోతి): ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల్లో కొవ్వూరు నియోజకవర్గం నుంచి అత్యధిక మెజార్టీ తీసుకురావాలని ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ, జిల్లా పరిశీలకుడు చిరంజీవి కోరారు. సోమవారం టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఎన్డీఏ భాగస్వామ్యపక్ష నాయకుల సమావేశం నిర్వహించారు. పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను కూటమి నాయకులకు పరిచయం చేశారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి టీవీ రామారావు, నియోజకవర్గ పరిశీలకుడు గొర్రెల శ్రీధర్, ద్విసభ్య కమిటీ సభ్యుడు కంటమణి రామకృష్ణారావు, ఎంపీపీ కాకర్ల నారాయుడు, అర్బన్ బ్యాంకు చైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ, పట్టణ అధ్యక్షుడు దాయన రామకృష్ణ, సూరపనేని చిన్ని, మండల అధ్యక్షుడు వట్టికూటి వెంకటేశ్వరరావు, బీజేపీ నాయకులు బోడపాటి ముత్యాలరావు, టీడీపీ నాయకులు మద్దిపాటి సత్యనారాయణ, మేకల శ్రీను, జొన్నలగడ్డ శ్రీనివాస్, చావా శ్రీనివాస్ పాల్గొన్నారు.

దూసుకొచ్చిన మృత్యువు


దంపతుల ప్రాణాలను బలిగొన్న కారణమైన ఆర్టీసీ బస్సు మృతి చెందిన వెంకటేశ్వరరావు, దుర్గ (పాత చిత్రం)

ఆర్టీసీ బస్సు ఢీకొని దంపతుల మృతి

గోపవరం వద్ద ప్రమాదం

శుభకార్యానికి వెళ్తుండగా ఘటన



నిడదవోలు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సోదరుడి ఇంట్లో శుభ కార్యక్రమానికి వారెంతో ఆనందంతో బయల్దేరారు. మరో ఐదు నిమిషాల్లో గమ్యస్థానానికి చేరుకునేలోపు మృత్యువు బస్సు రూపంలో కబళించింది. తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు మండలం గోపవరం వద్ద సోమవారం ఉదయం యాక్టివా స్కూటర్‌ను బస్సు ఢీకొన్న ఘటనలో దంపతులు దుర్మరణం చెందారు. వివరాలు ఇలా వున్నాయి... పశ్చిమ గోదావరి జిల్లా తణుకు మండలం పైడిపర్రుకు చెందిన బెల్లంకొండ వెంకటేశ్వరరావు (63)-దుర్గ (50) దంపతులు కొవ్వూరు మండలం మద్దూరులోని తమ సోదరుడు మనుమడి పురిటి స్నానం, ఉయ్యాలలో పెట్టే కార్యక్రమంలో పాల్గొనేందుకు సోమవారం ఉదయం 9 గంటల సమయంలో యాక్టివాపై బయల్దేరారు. నిడదవోలు మండలం గోపవరం వద్దకు వచ్చేసరికి 10.30-11 గంటల మధ్య రాజమహేంద్రవరం నుంచి తాడేపల్లిగూడెం వైపు వస్తున్న నిడదవోలు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వారిని ఢీకొట్టింది. దంపతులిద్దరూ సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న బంధువులు పెద్ద ఎత్తున అక్కడకు చేరుకున్నారు. సమిశ్రగూడెం ఎస్ఐ కె.వీరబాబు కేసు నమోదు చేసి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నిడదవోలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వెంకటేశ్వరరావు దంపతుల స్వగ్రామం విజ్జేశ్వరం కాగా కూలి పనుల నిమిత్తం తణుకు మండలం పైడిపర్రులో నివాసముంటున్నారు. ప్రమాదం విషయం తెలియడంతో పైడిపర్రు, విజ్జేశ్వరం, మద్దూరు గ్రామాల నుంచి బంధువులు నిడదవోలు ప్రభుత్వాసుపత్రికి చేరుకున్నారు. వారి రోదనలతో ఆసుపత్రి ప్రాంగణమంతా కన్నీటి సంద్రమైంది.


నిడదవోలు ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలో రోదిస్తున్న బంధువులు


నిందితుడితో పాటు స్వాధీనం చేసుకున్న ఆభరణాలను చూపిస్తున్న అనపర్తి సీఐ సుమంత్, ఎస్ఐ శ్రీనునాయక్

చోరీ కేసుల్లో నిందితుడి అరెస్టు

అనపర్తి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా అనపర్తి మండలం అనపర్తి, కుతుకులూరు గ్రామాల్లో చోరీలకు పాల్పడిన నిందితుడిని పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. అనపర్తి సీఐ సుమంత్ తెలిపిన వివరాల ప్రకారం.. సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో అనపర్తిలోని మహాలక్ష్మి జ్యూయలరీ వర్క్ షాపులోను, కుతుకులూరులోని పులగం వెంకటరెడ్డి నివాసంలోను చోరీలు జరిగాయి. ఈ నేరాలకు పాల్పడిన రాయవరం మండలం వెదురుపాక గ్రామానికి కట్టా శివశంకర్‌ను అరెస్టు చేసి అతడి నుంచి 12 గ్రాముల బంగారం, 211 గ్రాముల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై వివిధ పోలీస్ స్టేషన్లలో ఇప్పటికే 50 చోరీ కేసులు పెండింగులో ఉన్నాయి. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా రిమాండ్ నిమిత్తం రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనునాయక్ పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

11 మంది అరెస్టు... రూ.16 వేల నగదు స్వాధీనం

అనపర్తి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా అనపర్తిలోని ధరణికోట శివారులో పేకాట శిబిరంపై ఎస్ఐ శ్రీనునాయక్ ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం రాత్రి దాడులు నిర్వహించారు. పేకాడుతున్న 11మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.16,600 నగదు స్వాధీనం చేసుకున్నారు.

మహిళలకు ఉచిత బస్సు హామీ నెరవేర్చాలి

రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదుట కాంగ్రెస్ శ్రేణుల ధర్నా



ఆర్టీసీ బస్‌కాంప్లెక్ ఎదుట ధర్నా చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం హామీని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం రాజమహేంద్రవరంలోని ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ ఎదుట జిల్లా కాంగ్రెస్ కమిటీ, జిల్లా మహిళా కాంగ్రెస్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి నాయకులు ఇచ్చిన మాట మేరకు ఉచిత బస్సు హామీ నెరవేర్చాలని కోరారు. ఈ మేరకు ప్రతి నియోజకవర్గం నుంచి వెయ్యి పోస్టుకార్డులతో ఉద్యమానికి శ్రీకారం చుడతామన్నారు. పీసీసీ అధికార ప్రతినిధి అమర్ జహాబేగ్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ కూటమి ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి అరుణకుమారి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు మోత శారద, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు మురళీధర్, వడయార్ తదితరులు పాల్గొన్నారు.

26న ఆర్ట్స్ కళాశాలలో మెగా జాబ్ మేళా

ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్స్‌లో ఈనెల 26న మెగా జాబ్ మేళను ఏర్పాటు చేస్తున్నానని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. సోమవారం రాజమహేంద్రవరం తిలక్‌రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యువతను చెడు వ్యసనాల నుంచి దూరం చేసేందుకు కృషి చేస్తున్నామని, ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. ఇప్పటికే సోషల్ మీడియాలో తాము పెట్టిన పోస్టింగ్‌లకు నిరుద్యోగులు స్పందించి 4వేల మందిపైబడి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని చెప్పారు. తన సొంత ఖర్చులతో ఈ జాబ్ మేళా ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. డివిజన్ల వారీగా తాము కరపత్రాలు పంపించామని వాటిలో ఉన్న క్యూఆర్‌కోడ్‌ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ డిగ్రీ, ఇంజనీరింగ్ చదువుకున్నవారు ఎంతమంది వస్తారో దానిని బట్టి ఉద్యోగావకాశాలు ఉంటాయన్నారు. రాజమహేంద్రవరాన్ని ఐటీ హబ్‌గా తీర్చిదిద్దుతామన్నారు. స్థానిక ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ప్రక్షాళణ చేయకతప్పదన్నారు. మెరుగైన వైద్యసేవలు ప్రజలకు అందాలన్నారు. మెడికల్ కళాశాలలో పరికరాలు, మౌలిక సదుపాయాలు, కల్పించేందుకు రూ.80నుంచి 90 కోట్లు నిధులు వస్తున్నాయని, అనాటమీ ప్రొఫెసర్ నియమితులయ్యారని తెలిపారు. సమావేశంలో టీడీపీ పార్లమెంట్ డాక్టర్స్ సెల్ అధ్యక్షుడు యాళ్ల ప్రదీప్, నక్కా దేవివరప్రసాద్, యిన్నమూరి దీపు, శెట్టి జగదీష్, ఉర్లంకల లోకేష్, చింతపల్లి నాని, మునిని బాబురావు, చాలప చిన్నరాజు, సాయిదీపక్ పాల్గొన్నారు.

లాబ్ టెక్నీషియన్ల సేవలు ఎనలేనివి

›› మంత్రి కందుల దుర్గేష్ ›› రాజమహేంద్రవరంలో 'డయాగ్నోకాన్-2024'


మంత్రి దుర్గేష్‌ను సత్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

రాజమహేంద్రవరం కల్చరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కొవిడ్ సమయంలో ల్యాబ్ టెక్నీషిన్లు ఎనలేని సేవలందించారని, వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ చెప్పారు. రాజమండ్రి ల్యాబ్ టెక్నీషియన్ల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తూర్పుగోదావరి జిల్లా దయాగ్నోకాన్-2024 కార్యక్రమం హోటల్ షెల్టన్‌లో జరిగింది. అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కొక్కి రి కిరణ్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథులుగా మంత్రి దుర్గేష్‌తోపాటు ఎమ్మెల్యే లు ఆదిరెడ్డి వాసు, బత్తుల బలరామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు విచ్చేశారు. ఎమ్మెల్యే బత్తుల మాట్లాడుతూ అసోసియేషన్ భవన నిర్మాణానికి స్థలం కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ల్యాబ్ టెక్నీషియన్లకు ప్రభుత్వం భరోసా కల్పిస్తుందని ఎమ్మెల్యే వాసు ఆదిరెడ్డి అన్నారు. సుమారు 300 మంది ల్యాబ్ టెక్నీషియన్లు హాజరైన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి రాజేష్, భాను ప్రకాష్, నానిబాబు, బాషా, యువరాజు, నవీన్, బషీర్ పాల్గొన్నారు.

శరీర, అవయవదానంపై అవగాహన సదస్సు

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో సోమవారం శరీర, అవయవదానంపై కళాశాల సెమినార్ హాలులో వర్క్‌షాపు నిర్వహించారు. విశాఖపట్నంకు చెందిన సావిత్రిబాయి పూలే ఛారిటబుల్ ట్రస్టు (ఎస్‌పీఈసీటీ) సమన్వయంతో దీన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎస్‌పీఈసీటీ ఛైర్‌పర్సన్ సీతామహాలక్ష్మి, ప్రిన్సిపల్ సెక్రటరీ వి.వినోద్‌బాలు మాట్లాడుతూ మనుషుల ప్రాణాలు కాపాడటానికి బాడీ, బ్లడ్, ఆర్గాన్ డొనేషన్ అత్యంత కీలకమైనవని అన్నారు. విద్యార్థులంతా వీటి గురించి అవగాహన కల్గి ఉండాలని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే మాట్లాడారు. ఇంగ్లీష్ డిపార్టుమెంట్ హెచ్‌ఓడీ ఎం.శ్రీ లక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ నాయకత్వంలో దేశాభివృద్ధి

ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి


గోకవరంలో శ్రీనివాసరావును సత్కరించిన వేటుకూరి

అనపర్తి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): భారత దేశ అభివృద్ధికి ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వం ఎంతో అవసరమని, బీజేపీ సభ్యత్వ నమోదుతో మోదీని బలపరుద్దామని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని రామవరంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఎం.శివరామకృష్ణంరాజు ఆధ్వర్యంలో ఆయన బీజేపీ క్రియాశీల సభ్యత్వాన్ని నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీజేపీ నాయకులు, కార్యకర్తల చొరవతో నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో సభ్యత్వం నమోదు జరిగిందన్నారు. కార్యక్రమంలో కర్రి బులిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసరావు కృషి అభినందనీయం

గోకవరం, అక్టోబరు 21: బీజేపీ సభ్యత్వ నమోదులో విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు చేసిన కృషి అభినందనీయమని పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేటుకూరి సూర్యనారాయణరాజు అన్నారు. గోకవరంలోని సీఎండీ కేఎస్‌పీ లేఅవుట్‌కు సోమవారం విచ్చేసిన ఆయన శ్రీనివాసరావును సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేవలం 17 రోజుల్లో 17,700 సభ్యత్వాలు చేయించడం సామాన్య విషయం కాదన్నారు. బీజేపీ బలపడితేనే దేశంలో హిందూ ధర్మం, సనాతన ధర్మం రక్షించబడతాయన్నారు. పేదలకు, దేవాలయాల అభివృద్ధికి శ్రీనివాసరావు అందిస్తున్న సేవలను ఇప్పటికే పార్టీ అధినాయకులు చాలావరకు గుర్తించారన్నారు. కార్యక్రమంలో వరాలబాబు, మట్టా మంగరాజు, సత్తి వెంకటరెడ్డి, మామిడి అయ్యప్ప, తామర్ల రాంబాబు, ఇనగోటి బాపన్నదొర పాల్గొన్నారు.



రాజమహేంద్రవరంలో రాత్రి గస్తీ పెంపు

ఏడు ప్రత్యేక బృందాలు ఏర్పాటు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అసాంఘిక శక్తులను, కార్యకలాపాలను అణచివేసేందుకు జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ ఏడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సోమవారం రాత్రి ఆయా బృందాలకు ఆయన ఆదేశాలు జారీచేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రాజమహేంద్రవరం అర్బన్ పరిధిలో అసాంఘిక శక్తులపై ప్రత్యేక బృందాల ద్వారా ఉక్కుపాదం మోపుతామన్నారు. అర్బన్‌లో ఆరు ప్రత్యేక బృందాలు, ఒక మహిళా రక్షిత బృందం రాత్రి వేళలో పెట్రోలింగ్‌ను పటిష్టంగా చేస్తాయన్నారు. బృందాలకు దిశనిర్దేశం చేశారు.

రేపు ఆర్ట్స్ కళాశాలలో దివీస్ ల్యాబ్స్

క్యాంపస్ సెలక్షన్స్

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఈనెల 23వ తేదీన దివీస్ ల్యాబ్స్ వారితో క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే ఒక ప్రకటనలో తెలిపారు. ట్రైనీ సూపర్‌వైజర్లు, గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేస్తారని, 2020-2024 సంవత్సరాల్లో డిగ్రీ పూర్తిచేసిన బీఎస్సీ కెమిస్ట్రీ, బీ.ఫార్మసీ, ఎంఎస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ, అనలిటికల్ కెమిస్ట్రీ, ఎం-ఫార్మసీ, బీటెక్ కెమికల్ అర్హత కల్గిన విద్యార్థులు అర్హులని తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్న వారు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, జెరాక్సులతో హాజరుకావచ్చని కళాశాల జేకేసీ కో ఆర్డినేటర్ హరినాథరెడ్డి తెలిపారు.

శనగ విత్తనాల పంపిణీ

రంగంపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రైతులను ఆర్థికంగా అభివృద్ధి చేయాలన్నదే కూటమి ప్రభుత్వం ధ్యేయమని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. మండలం కె.కోటపాడులో సోమవారం రాయితీపైశనగ విత్తనాలు పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని, రైతులకు రాయితీపై ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ యంత్రాలను అందిస్తున్నారు. మండలంలో 650 క్వింటాళ్ల శనగ విత్తానాలను అందుబాటులో ఉంచినట్టు చెప్పారు. మండల వ్యవసాయాధికారి కె.శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల గోవింద్, నీలపాల త్రిమూర్తులు, ఎలుగుబంటి సత్తిబాబు, ఎం.సాయిరాం, గిరజాల సత్తిబాబు పాల్గొన్నారు.

బిక్కవోలు ఎంపీడీవోగా శ్రీనివాస్



బిక్కవోలు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): బిక్కవోలు ఎంపీడీవోగా వి.శ్రీనివాస్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన అనకాపల్లి జిల్లా నక్కపల్లి ఎంపీడీవోగా పనిచేసి బదిలీపై బిక్కవోలు వచ్చారు. ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది రత్నకుమార్, మంగరాజు తదితరులు ఘనంగా స్వాగతం పలికారు.

పుల్లా కుటుంబానికి పరామర్శ



కడియం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సత్యదేవా నర్సరీ అధినేత పుల్లా చంటియ్య ఇటీవల మృతి చెందారు. చంటియ్య సోదరుడు పుల్లా అబ్బులు, కుమారుడు పెదసత్యనారాయణ, పుల్లా వీరవెంకట్రావు, చిన సత్యనారాయణ, వీర్రాజు, రామకృష్ణ, శ్రీకాంత్‌లను సోమవారం ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజాలు వేర్వేరుగా పరామర్శించారు. చంటియ్య చిత్రపటం వద్ద పూలు వేసి నివాళులర్పించారు. అలాగే రావిపాటి రామచంద్రరావు, గట్టి సుబ్బారావు, పుల్లా రామారావు, తిరుమలశెట్టి శ్రీను, కొత్తపల్లి శివాజీ, ఈలి గోపాలం పుల్లా కుటుంబాన్ని పరామర్శించారు.

విద్యార్థిని మృతికి సంతాపం

దివాన్‌చెరువు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విద్యార్థిని కుంచె పల్లవి మృతి ఆమె కుటుంబానికి, తోటి విద్యార్థులకు, అధ్యాపకులకు తీరని లోటు అని ఉపకులపతి ఆచార్య వై శ్రీనివాసరావు అన్నారు. విశ్వవిద్యాలయంలో సోమవారం జరిగిన సంతాపసభలో పల్లవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు, వర్సిటీ సిబ్బంది రోడ్లపై జాగ్రత్తగా ప్రయాణించాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ప్రిన్సిపాల్ పి.విజయనిర్మల, వర్సిటీ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని పల్లవి ఆత్మశాంతి కోసం కొద్దిసేపు మౌనం పాటించారు.

రాజమహేంద్రవరం రూరల్

తహశీల్దార్‌గా సూర్యకుమార్

రాజమహేంద్రవరం రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రూరల్ తహశీల్దార్‌గా పీవీవీ జయసూర్య కుమార్ బాధ్యతలు చేపట్టారు. ఆయన చింతూరు తహశీల్దార్‌గా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. కాగా రాజమహేంద్రవరం రూరల్ తహశీల్దార్ స్థానం కొంతకాలంగా ఖాళీగా వుంది. సూర్యకుమార్‌కు డీటీ రాజబాబు వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలియజేశారు.

మాజీ మంత్రి జవహర్‌ను కలిసిన

ఎమ్మార్సీ సభ్యులు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో ఉద్యోగాలు కోల్పోయిన మండల రిసోర్స్‌సెంటర్ సభ్యులు 41 మంది ఇటీవల టీడీపీ కేంద్ర కార్యాలయంలో గ్రీవెన్స్‌లో మాజీ మంత్రి జవహర్‌ను కలిసి తమ సమస్యను వివరించారు. ఈ సమస్యను జవహర్ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై సీఎం చంద్రబాబు స్పందించి సమస్యకు పరిష్కారం చూపించారు. ఈ మేరకు సోమవారం ఎమ్మార్సీ సభ్యులు జవహర్‌కు ధన్యవాదాలు తెలిపారు. రాజమహేంద్రవరంలో ఒక ప్రకటన విడుదల చేశారు.

నేడు కొవ్వూరులో జాబ్‌మేళా

కొవ్వూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 22న కొవ్వూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి శాఖాధికారి గంటా సుధాకర్, కళాశాల ప్రిన్సిపాల్ జె.సునీత తెలిపారు. జాబ్‌మేళాలో పాల్గొనే అభ్యర్థులు ఐటీఐ, డిప్లొమా, ఏదైనా డిగ్రీ, బీఎస్సీ కెమిస్ట్రీ, బిఫార్మసీ, ఎంఫార్మసీ, పీజీ విద్యార్థులు అర్హులన్నారు. వివరాలకు 73062 32373లో సంప్రదించాలని చెప్పారు.

గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

›› ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి
›› పలుచోట్ల పల్లె పండుగ కార్యక్రమాలు


కడియపులంకలో శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే గోరంట్ల

కడియం, అక్టోబరు 21: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించామని, ప్రణాళికాబద్ధంగా గ్రామాల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నట్టు రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి చెప్పారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా సోమవారం మురమండ, కడియపులంక గ్రామాల్లో నిర్మించనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీలకు ఆయన శంకుస్థాపనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసమే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెపాప్పరు. అనంతరం కడియపులంక బృందావన అతిథి గృహంలో తాత్కాలిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే గోరంట్ల ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, మార్గాని సత్యనారాయణ, గంగుమళ్ల సత్యనారాయణ, ప్రత్తిపాటి రామారావుచౌదరి, దేవళ్ల రాంబాబు, వట్టకూటి జానకీరామ్, గట్టి సుబ్బారావు, పాటంశెట్టి రాంజీ, గట్టి నర్సయ్య మల్లు పోలరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతులు

రంగంపేట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతి మారుమూల గ్రామంలో రోడ్లు, డ్రైనేజీలు వంటి మౌలిక వసతులు కల్పించడమే ధ్యేయంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ పనిచేస్తున్నారని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కె.కోటపాడు, పి.కోటపాడు, వెంకటాపురం, సుభద్రంపేట, దొడ్డిగుంట, మర్రిపూడి, సింగంపల్లి, నల్లమిల్లి గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలకు ఆయన శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంతో రాష్ట్రంలో అభివృద్ధి స్తంభించిపోయిందని, రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపించేందుకు చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో గ్రామాల్లో సీసీ రోడ్డు నిర్మాణం కాదుకదా రోడ్లుకు పడిన గుంతలు పూడ్చలేదని అన్నారు. కార్యక్రమాల్లో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల గోవింద్, నీలపాల త్రిమూర్తులు, ఎలుగుబంటి సత్తిబాబు, ఎం.సాయిరాం, గిరజాల సత్తిబాబు, పోతుల వెంకటరావు, అడబాల వెంకటరావు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.


రంగంపేట: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

పల్లెల్లో పండుగ

కోరుకొండ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో పంచాయతీ వారోత్సవాలతో పల్లెల్లో పండుగ వాతావరణం నెలకొందని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పేర్కొన్నారు. మండలంలోని దోసకాయలపల్లి, గాడాల, మధురపూడి, గుమ్ములూరు, బుచ్చింపేట, జగన్నాథపురం గ్రామాల్లో నిర్మించనున్న సీసీ డ్రైన్లకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణచౌదరి, బీజేపీ ఇన్‌చార్జి నీరుకొండ వీరన్నచౌదరిలతో కలిసి బత్తుల శంకుస్థాపన చేశారు. కార్యక్రమాల్లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కంటే నాగ కేశవరావు, తనకాల నాగేశ్వరరావు, ఏపీఆర్ చౌదరి, అడపా శ్రీనివాస్, మేడిశెట్టి శివరాం, సర్పంచ్‌లు ధారా యశోదమ్మ, నక్కా రాంబాబు పాల్గొన్నారు.


దోసకాయలపల్లిలో శిలాఫలకం ఆవిష్కరించిన ఎమ్మెల్యే బత్తుల

పోలీసు అమరవీరుల సేవలు మరువద్దు

›› పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో ఎమ్మెల్యే బత్తుల
›› పలుచోట్ల పోలీసుల ర్యాలీలు

కోరుకొండ, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణలో ప్రాణాలు ఒడ్డి పోరాడిన పోలీసు అమరవీరుల సేవలను జాతి ఎన్నటికి మరువదని, వారి స్ఫూర్తితో పోలీసులు తమ విధి నిర్వహణకు పునరంకితం కావాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పలుచోట్ల సోమవారం నిర్వహించి పోలీసు అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. కోరుకొండ బస్టాండ్ నుంచి ఏర్పాటు చేసిన ర్యాలీలో విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే పా ల్గొన్నారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ ప్రపంచమం తా నిద్రలో ఉంటే పోలీసులు మే ల్కొని, ఎండా వాన, పగలూ రాత్రి తేడా లేకుండా దేశాన్ని రక్షిస్తున్నారన్నారు. కుటుంబాలు సైతం దూరంగా ఉంటు న్నారన్నారు. ర్యాలీలో పోలీసు అధికారులు, సిబ్బంది, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కోరుకొండలో పోలీసు అమరవీరుల సంస్మరణ ర్యాలీ దృశ్యం

అనపర్తి: అనపర్తిలో పోలీసులు స్థానిక దేవీచౌక్ నుంచి మార్కెట్ సెంటర్ వరకు విద్యార్థులు, వ్యాపారులతో కలిసి కొవ్వొత్తులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అమరవీరులకు ఘన నివాళులర్పించారు. సీఐ సుమంత్ మాట్లాడుతూ నిరంతరం ప్రజల క్షేమం కోరుతూ ప్రాణాలను ఫణంగా పెట్టి పోలీసులు విధులు నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శ్రీను నాయక్, విద్యార్థులు, ప్రజలు, వ్యాపారులు పాల్గొన్నారు.

బిక్కవోలు: బిక్కవోలులో ఎస్‌ఐ వి.రవిచంద్ర కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులు, కూటమి నాయకులు ర్యాలీ జరిపారు. పోలీసుల త్యాగాలను మరవరాదన్నారు. కార్యక్రమంలో నాయకులు పాలచర్ల శివప్రసాద్ చౌదరి, గొర్రెల త్రిమూర్తులు, టీటీ సత్యకృష్ణ, ఎంపీడీవో కార్యాలయ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


రాజమహేంద్రవరంలో నివాళులర్పిస్తున్న సీఆర్పీఎఫ్ కమాండెంట్

రాజమహేంద్రవరం (ఆంధ్రజ్యోతి): కేంద్ర రిజర్వు పోలీసు దళం(సీఆర్పీఎఫ్) జవానుల త్యాగ నిరతికి ప్రతీక పోలీసు అమరవీరుల సంస్మరణ దినమని 42వ బెటాలియన్ కమాండెంట్ ధరమ్ ప్రకాశ్ పేర్కొన్నారు. బెటాలియన్ హెడ్ క్వార్టర్స్‌లో జరిగిన పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవంలో ఆయన మాట్లాడారు. 1959లో అక్టోబరు 21న లద్దాక్ సమీపంలోని హాట్‌స్ప్రింగ్ ప్రాంతంలో సీఆర్పీఎఫ్ జవానులు వీరోచిత పోరాటం చేసి శత్రువులు మన దేశంలో చొరబడకుండా నిలువరించారని, ఆ సమయంలో ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారని ఈ సందర్భంగా కమాండెంట్ గుర్తు చేశారు. గత ఏడాది సెప్టెంబరు 1 నుంచి ఈ ఏడాది ఆగస్టు 31 వరకూ ప్రాణాలు కోల్పోయిన రాష్ట్ర పోలీసులు, కేంద్ర సాయుధ పోలీసు బలగాల సిబ్బంది పేర్లను ఆయన చదివి వినిపించారు. ఆయా కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. అమర పోలీసుల కుటుంబాలకు అండగా నిలవాల్సిన బాధ్యత దేశ పౌరులందరికీ ఉందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమాండెంట్ బి.రత్నమ్మ, అసిస్టెంట్ కమాండెంట్ సంతోష్ కుమార్ సింగ్ తదితరలు పాల్గొని పోలీసు అమరవీరులకు నివాళులర్పించారు.

25న మున్సిపల్ వర్కర్స్ యూనియన్

జిల్లా సమావేశం

ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు తాటిపాక మధు


సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు తాటిపాక మధు

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అపరిష్కృతంగా ఉన్న మున్సిపల్ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 25న ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా జనరల్ బాడీసమావేశం రాజమహేంద్రవరంలో నిర్వహిస్తున్నామని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు తాటిపాక మధు తెలిపారు. సోమవారం రాజమహేంద్రవరంలోని సీతంపేట మస్టర్ కార్మికుల సమావేశంలో మధు మాట్లాడుతూ ఆప్కాస్‌ను తక్షణమే రద్దు చేసి మున్సిపల్ వారసత్వాన్ని కాపాడాలని, జనాభా ప్రాతిపదికన కార్మికుల సంఖ్యను పెంచాలని అన్నారు. జనరల్ బాడీ సమావేశానికి యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.సుబ్బరాయుడు ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు రెడ్డి రమణ, దుర్గమ్మ, పోలేరమ్మ పాల్గొన్నారు.

వైభవంగా మహా కుంభాభిషేకం


శత చండీ యాగంలో పాల్గొన్న భక్తులు

తాళ్లపూడి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): తాళ్లపూడిలోనున్న కనకదుర్గ ఆలయంలో మహా కుంభాభిషేకం, శత చండీయాగం కార్యక్రమాలకు సోమవారం నుంచి శ్రీకారం చుట్టారు. యాగానికి ప్రత్యేకంగా నిర్మించిన యాగశాలలో అమ్మవారిని ప్రతిష్ఠించి యాగశాల ప్రవేశం, గణపతిపూజ, గోపూజ, పుణ్యాహ వచన, దీక్షధారణ కార్యక్రమాలు జరిపారు. ఆలయ ధర్మకర్త నీలి సూర్యనారాయణ మాట్లాడుతూ మంగళవారం 108 దంపతులతో శతచండీ, దశ మహాదేవి హోమాలు జరుగుతాయన్నారు. సాయం త్రం పద్మశ్రీ గరికపాటి నరసింహారావు ప్రవచ నాలు జరుగుతాయని తెలిపారు. బుధవారం దుర్గా మల్లేశ్వరస్వామి శాంతి కల్యాణం జరు పుతారని మధ్యాహ్నం నుంచి అన్న సమారా ధన జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాలు సిద్ధేశ్వర, కార్తికేయ ఆచార్యత్వంలో అర్చకుడు అల్లూరి శివప్రసాద్‌శర్మ అధ్వర్యంలో జరుగ నున్నట్టు తెలిపారు.

విశాఖ ఉక్కుప్రైవేటీకరణ

ఆలోచన విరమించుకోవాలి

కొవ్వూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆలోచన విరమించుకోవాలని మాల సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ బొంతా శ్యాంరవిప్రకాష్ డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు నినాదంతో స్టీల్‌ప్లాంట్ సాధించిన అమరజీవి టి.అమృతరావు 103వ జయంతికి శుభాకాంక్షలు తెలిపారు. 32 మంది ప్రాణాలు త్యాగం చేసి సాధించిన స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేయాలనుకోవడం దుర్మార్గమన్నారు. కేంద్ర ప్రభుత్వం 38 వేల కోట్ల బడ్జెట్ కేటాయించి కార్మికులను ఆదుకోవాలన్నారు. ఎన్నికల ముందు విశాఖ ఎమ్మెల్యే పళ్ళ శ్రీనివాస్, ఎంపీ భరత్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటుపరం కాకుండా చర్యలు తీసుకుంటామని చెప్పి 120 రోజులు పూర్తయినా దీని ఊసెత్తకపోవడం బాధాకరమని శ్యాంరవిప్రకాష్ అన్నారు.


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు

ఫిర్యాదులు

కొవ్వూరు, అక్టోబరు 21(అంధజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మూడు ఫిర్యాదులు వచ్చినట్టు ఆర్డీవో రాణి సుస్మిత తెలిపారు. కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో సోమవారం డివిజనల్ స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ప్రజల ఫిర్యాదులను తక్షణం పరిష్కరించాలని అధికారులకు ఆమె సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయ ఏవో జీఎస్ఎస్ జవహర్ బాజి, ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పశువుల షెడ్ల ఏర్పాటుపై

లబ్ధిదారులకు అవగాహన


మాట్లాడుతున్న ఎంపీపీ దుర్గారావు

దేవరపల్లి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): దేవరపల్లిలో పశువుల షెడ్లకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీపీ కేవీకే దుర్గారావు మాట్లాడుతూ పశువుల షెడ్లు మంజూరైన లబ్ధిదారులంతా త్వరితగతిన పూర్తి చేసుకోవాలన్నారు. వీటి నిధులు విడతల వారీగా బ్యాంకు ఖాతాలో జమ చేస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వేణుగోపాలరెడ్డి, ఏపీవో శ్రీనివాసరావు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



డీపీవోగా నాగలత బాధ్యతల స్వీకరణ

రాజమహేంద్రవరం రూరల్ అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) : జిల్లా గ్రామ పంచాయతీ అధికారిగా ఎం.నాగలత సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈమె రాజమహేంద్రవరం డీఎల్‌పీవోగా విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు డీపీవోగా విధులు నిర్వహించిన శ్రీనివాసరావు మరణించారు. ఈ మేరకు ఆయన స్థానంలో ఈమెకు ఇన్‌చార్జ్ బాధ్యతలు ఇస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు.



వాడపల్లి వెంకన్న బ్రహోత్సవాలు సోమవారం నుంచి ఘనంగా ఆరంభమయ్యాయి. పెద్ద ఎత్తున భక్తజనం హాజరై స్వామిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే బండారు సత్యానందం దంపతులు పూజలు చేసి ఉత్సవాలను ప్రారంభించారు.

జీతాలివ్వండి.. సమస్యలు పరిష్కరించండి

కలెక్టర్, వైద్యాధికారులకు 108 వైద్యసిబ్బంది వినతి

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : సమస్యలు పరిష్కరించాలని జిల్లాలోని 108 వాహనాల వైద్య సిబ్బంది ఆందోళనకు దిగారు. సోమవారం కలెక్టర్ ప్రశాంతి, డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, జిల్లా ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ డాక్టర్ ప్రియాంకలను కలిసి వినతిపత్రాలు అందజేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఏలూరి నాగ వెంకటరమణ మాట్లాడుతూ సమస్యల పరిష్కరించాలని గతంలో అనేకసార్లు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదన్నారు. సకాలంలో జీతాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రభుత్వం, యాజమాన్యం వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు.మూడు నెలలుగా తమకు జీతాలు చెల్లించడంలేదని, రెండేళ్ల నుంచి ఇంక్రిమెంట్లు వేయకపోవడం, వేతన స్లాబులు అప్‌గ్రేడ్ చేయకపోవడం వల్ల తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గుజ్జాల రమేష్‌బాబు, వర్కింగ్ ప్రెశిడెంట్ జొన్నకూటి నానాజీ, కోశాధికారి జే.వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

అదిగో.. చిరుత!



చిరుత.. సెప్టెంబరు 6వ తేదీన రాజమహేంద్రవరం రిజర్వు ఫారెస్టులో ప్రత్యక్షమైంది.. 24 రోజుల తరువాత రిజర్వు ఫారెస్టు నుంచి వెళ్లి కడియంలో కనిపించింది.. ఆ తరువాత నుంచి అడపాదడపా పుకార్లు షికార్లు చేశాయి.. అయితే ఎక్కడా చిరుత జాడలేదు.. దీంతో అందరిలోనూ ఒకటే అయోమయం.. అసలు చిరుత ఏమైపోయిందనే కలకలం రేగింది.. ఇదిలా ఉండగా ద్వారకాతిరుమల మండలం ఎం.నాగులాపల్లి శివారు అందాలమ్మ చెరువు ప్రాంతంలో సోమవారం ట్రాప్ కెమెరాకు ఒక చిరుత చిక్కింది. ఈ చిరుత తూర్పుగోదావరి నుంచి వెళ్లినదేనా అనే అనుమానం రేకెత్తుతోంది. - వివరాలు 8లో

చీకటి దందాపై సీరియస్

గోకవరం ఘటనపై ఆరా

గోకవరం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) : గోకవరం రెవెన్యూ శాఖలో చీకటి దందా బయటపడడంతో ఏళ్ల తరబడి నుంచి వేలాడుతున్న అవినీతి గబ్బిలాలను తరిమేందుకు రంగం సిద్ధమైనట్టు తెలిసింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి నాయకులతో అంటకాగిన ఆ ఇద్దరు ముగ్గురు గ్రామస్థాయి అధికారులు కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక మళ్లీ అదే తరహాలో టీడీపీ నాయకులను మచ్చిక చేసుకునే ప్రయత్నాలను ఆరంభించారు. గోకవరం మండలం నుంచి బదిలీ కాకుండా ఇదే ప్రాంతంలో ఏదొక గ్రామాన్ని అంటిపెట్టుకొని వేలాడాలనే ప్రయత్నం చేసి సఫలీకృతమయ్యారు.అయితే అక్రమాలకు అడ్డాగా మారిన గోకవరం తహశీల్దార్ కార్యాలయంపై అవినీతి గబ్బిలాలు అంటూ 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం వచ్చిన కథనంతో ఉన్నతాధికారులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఏళ్ల తరబడి పాతుకుపోయిన అధికారుల వివరాలను వెంటనే అందించాలని ఉన్నతాధికారుల నుంచి స్థానిక తహశీల్దారుకు ఆదేశాలు వెలవడినట్టు తెలిసింది. రాత్రి సమయంలో అసలు కార్యాలయంలో ఏం జరుగుతుందంటూ ఇక్కడి అధికారులపై ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. ఆ ఇద్దరు ముగ్గురు గ్రామస్థాయి అధికారులలో ఇద్దరు తాజాగా మరో అక్రమానికి తెరలేపగా కొత్తగా బాధ్యతలు చేపట్టిన మండలస్థాయి అధికారి వాటికి చెక్ పెట్టినట్లు తెలియవచ్చింది.

అయ్యప్ప దీక్ష..పోలీసులకు అనుమతుల్లేవ్

ఎస్పీ నరసింహ కిశోర్

రాజమహేంద్రవరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప/భవానీ దీక్షలకు పోలీస్ సిబ్బందికి అనుమతిలేదని ఎస్పీ నరసింహ కిషోర్ ఉత్తర్వులిచ్చారు. విధుల్లో ఉండే పోలీసులు నిబంధనలను అనుసరించి యూనిఫాం, షూ తదితర నిబంధనలు పాటించాల్సిందేనన్నారు. అయ్యప్ప దీక్ష తీసుకునేవాళ్లు తప్పని సరిగా సెలవుకు అర్జీ పెట్టుకోవాలన్నారు. ఉత్తర్వులను తప్పనిసరిగా అమలు చేయాల్సిందేనని డీఎస్పీలు, కొవ్వూరు ఎస్‌డీపీవో, అందరు ఎస్‌హెచ్‌వోలను ఆదేశించారు. దీక్షల కోసం అనుమతి కోరుతూ ఏ విధమైన వినతులనూ జిల్లా పోలీసు కార్యాలయానికి పంపించవద్దని పేర్కొన్నారు. ఈ ఉత్తర్వులపై సిబ్బంది మనోవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇది కచ్చితంగా హైందవంపై చిన్న చూపేనని, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తక్షణమే కల్పించుకోవాలని విన్నవిస్తున్నారు. జిల్లా పోలీసు సిబ్బందిలో ఇప్పటికే కొందరు అయ్యప్ప దీక్ష తీసుకున్నారు. శబరిమల వెళ్లడానికి అనుమతిస్తారో లేదో తెలియని అగమ్యగోచరంలో వాళ్లు పడిపోయారు.మరి కొందరు మాలధారణకు అనుమతి దొరక్క తీవ్ర మానసిక ఆందోళన చెందుతున్నారు.దీక్ష తీసుకున్నప్పటికీ విధుల సమయంలో యూనిఫాం, టోపీ ధరిస్తున్నామని, కేవలం షూ మాత్రమే ఉండదని, మాలాధారణ చేశామనే సంకేతానికి మేడలో నల్ల టవల్ మాత్రం వేసుకుంటున్నామని గుర్తు చేస్తున్నారు.కేవలం 45 రోజులపాటు మాత్రమే దీక్షకు సంబంధించిన నియమాల్లో ఉంటున్నామన్నారు. వచ్చే నెల 1వ తేదీ నుంచి కార్తీక మాసం వస్తుంది.జ్యోతి దర్శనానికి శమరిమల వెళ్లే వాళ్లు ఆ తేదీల్లోనే మాలధారణ చేస్తారు.వాళ్ల పరిస్థితీ అయోమయంగానే ఉంది. భవానీ దీక్ష ముగిసిన తర్వాత అయ్యప్ప దీక్షా సమయంలో ఇలాంటి ఉత్తర్వులపై విమర్శలు వస్తున్నాయి.



ఏం టీ పని!

యథేచ్ఛగా నకిలీ టీపొడి తయారీ

- బూట్ పాలిష్ పేరుతో నకిలీ టీపొడి
- ప్రజారోగ్యంతో వ్యాపారుల ఆటలు
- జిల్లాలో అనేక చోట్ల తయారీ ప్రక్రియ
- రాష్ట్రంలో అనేక చోట్లకు సరఫరా
- అధికారులు స్పందించాలని డిమాండ్

అనపర్తి అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఛాయ్ మనస్సుకు మందురా భాయ్.. ఈ ఛాయ్ గళాసుకీ జైజై అంటూ ఓ సినీ కవి ఛాయ్‌పై ఓ గీతాన్ని రచించాడు.. దీనిలో టీ వినియోగంపై ఎంత మోజు ఉందో అర్థమవుతుంది. సాధారణంగా కూలీ నుంచి కోటీశ్వరుడి దాకా టీ అంటే ఇష్టపడని వారుండరు. టీ తయారీలో ప్రధానంగా కావలసిన టీపొడి ధరలు మాత్రం సామాన్యుడికి అందుబాటులో లేకపోవడంతో అనేక ప్రాంతాలలో నకిలీ టీ పొడి తయారీ కేంద్రాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. కంపెనీ టీ పొడిని తలదన్నే విధంగా అనేక రసాయనాలను కలిపి విక్రయాలు చేసి ప్రజారోగ్యాన్ని కొల్లగొడుతున్నారు. నిన్న మొన్నటి వరకు నాసి రకం తేయాకును తెచ్చి దానికి కొంచెం కెమికల్స్‌ను గుప్పించి తక్కువ ధరలకు విక్రయాలు సాగించేవారు. ఇటీవల నకిలీ టీ పొడి కొత్త పుంతలు తొక్కింది. జీడిపిక్కలు పొడి, చింత పిక్కల పొడిని తయారు చేసి డికాషన్ వచ్చే విధంగా కెమికల్స్ అద్ది టీ పొడిగా విక్రయాలు సాగించే ముఠాలు పెచ్చు మీరిపోతున్నాయి. జిల్లాలో అనేక చోట్ల గొడౌన్లను అద్దెకు తీసుకుని అక్కడికి చింతపిక్కలు, జీడి పిక్కల పొట్టును తెచ్చి ప్రత్యేకంగా తయారు చేసిన యంత్రాల ద్వారా వీటిని గుండ చేస్తున్నారు. తరువాత గుండను గొడౌన్లలోని కళ్ళంలో ఆరబెట్టి గొడౌన్లలో ఏర్పాటు చేసిన యంత్రాలతో టీపొడిని తయారు చేస్తున్నారు.ఆ పొడిని బస్తాల ద్వారా చిన్న చిన్న టీ పొడి తయారీ కేంద్రాలకు తరలించగా అక్కడ ఈ పొడికి రంగు, రుచి, సువాసన వచ్చే విధంగా మరిన్ని కెమికల్స్‌ను జోడించి వివిధ బ్రాండ్ల పేరుతో తయారు చేసిన కవర్లలో ప్యాకింగ్‌లు చేసి విక్రయాలు సాగిస్తున్నారు. నిర్వాహకులు బూట్ పాలిష్‌కు ముడి సరుకుగా వినియోగించేందుకు ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నామంటూ అధికారులను నమ్మ బలుకుతున్నారు. గతంలో అనపర్తి, బిక్కవోలు మండలాల్లో ఈ తరహా నకిలీ టీ పొడి తయారీపై అధికారులు పెద్ద ఎత్తున తనిఖీలు నిర్వహించారు. దీంతో నిర్వాహకులు తమ దందాను మరో చోటికి మార్చారు. తూర్పుగోదావరి జిల్లాలో అనేక ప్రాంతాల్లో ఈ నకిలీ టీ పొడి తయారీ కేంద్రాలు ఉన్నాయి. జిల్లా యంత్రాంగం దృష్టి సారిస్తే వారి ఆట కట్టించవచ్చని ప్రజలు భావిస్తున్నారు. కల్తీ టీ పొడి భారిన పడి అనేక కుటుంబాలు అనారోగ్యాల భారిన పడి ఆసుపత్రుల పాలవుతున్నారు.. ఒక్కో పరిశ్రమ నుంచి రోజుకు వంద బస్తాల వరకు టీ పొడి తయారు చేయడమే కాకుండా రాష్ట్ర నలుమూలలకు సరఫరా అవుతుంది. నకిలీ టీపొడిని తయారు చేసేందుకు యంత్రాలను వినియోగిస్తున్నారు. జీడి పిక్కల పొట్టు, చింత పిక్కల పౌడర్‌ను యంత్రాల్లో ఆడించి మూడు రకాల పొడులు విడదీసి వాటిని కళ్ళంలో ఆరబెట్టి సంచుల్లో నింపుతున్నాను. ఈ సంచులను రాత్రి సమయాలలో తరలిస్తున్నారు. అయితే ఈ టీపొడి కేజీ 200 నుంచి రూ. 300 వరకు విక్రయాలు సాగిస్తున్నారు. ఇలా రవాణా చేసిన టీపొడి వివిధ ప్యాకింగ్‌ల రూపంలో తయారు చేసి పెద్ద ఎత్తున విక్రయాలు సాగిస్తున్నారు. అనపర్తి పరిసరాల నుండి ఇన్‌స్టాల్‌మెంట్ వ్యాపారం నిర్వహించే అనేక మంది రెండు తెలుగు రాష్ట్రాల్లోను వ్యాపారాలు సాగిస్తుండగా నకిలీ టీ పొడి వ్యాపారులు వీరిని ఆశ్రయించి ఈ టీపొడిని వారి ద్వారా విక్రయాలు సాగిస్తున్నారు.దీంతో ఎవరికి అనుమానం రాకుండా సరుకులు సుదూర ప్రాంతాలకు తరలిపోతున్నాయి. కల్తీ టీపొడిని తయారు చేసే కేంద్రాలపై నిఘా పెట్టి వీటిని అరికట్టకపోతే ఎంతో మంది ఆరోగ్యాలు పాడవుతాయని అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నకిలీ టీ పొడితో జీర్ణకోశ వ్యాధులు



నకిలీ పొడికి వినియోగించే రసాయనాలతో అనేక వ్యాధులు వ్యాపించడమే కాకుండా ప్రాణాంత కంగా కూడా మారతాయి. గ్యాస్టిక్, అల్సర్, గ్యాస్ ట్రైటిస్ వ్యాధులతో పాటు కేన్సర్‌కు దారి తీసే అవకాశాలు ఉన్నాయి. ఈ రసాయనాలు క్రమేపి రక్తంలో ప్రవేశించడం ద్వారా లివర్, కిడ్నీలకు సంబంధిత వ్యాదులు వస్తాయి. రక్త హీనత ఏర్పడుతుంది. కంటి చూపు మందగించడం, చెవి, ముక్కు, గొంతుకు సంబంధించిన వ్యాధులు వచ్చే అవకాశాలు ఎక్కు వ. చిన్నారుల్లో ఎదుగుదల క్షీణించడమే కాకుండా అనేక వ్యాధులు వచ్చి జ్ఞాపక శక్తి లోపిస్తుంది. - **డాక్టర్ తాడి రామగురెడ్డి సూపరింటెండెంట్ ఏరియా ఆసుపత్రి అనపర్తి**





పోలీస్ అమరవీరులకు నివాళులర్పిస్తున్న సిబ్బంది.. సెల్యూట్ చేస్తున్న కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ నరసింహ కిశోర్, కమిషనర్ కేతన్ గార్గ్ తదితరులు

అమరులకు.. జోహార్లు

ఘనంగా పోలీస్ అమరవీరుల దినం

రాజమహేంద్రవరం,అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): భరతజాతి రక్షణలో ప్రాణాలర్పించిన పోలీసు అమర వీరుల త్యాగాలు చిరస్మరణీయమని కలెక్టర్ ప్రశాంతి పేర్కొన్నారు. భద్రతా పరంగా ఎవరు ఆపదలో ఉన్నా రక్త సంబంధీకుల కంటే ముందుగా స్పందించే వాళ్లు పోలీసులని, ప్రజల రక్షణే పోలీసుల ధేయ్యమని ఎస్పీ నరసింహ కిషోర్ స్పష్టం చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలో సోమవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ దేశ సార్వభౌమాధికారాన్ని, ప్రజాస్వామ్యాన్ని రక్షించడంలో పోలీసులు ప్రదర్శించిన త్యాగాలను స్మరించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అన్నారు. ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఈ ఏడాది దేశవ్యాప్తంగా 214 మంది భద్రతా సిబ్బందిని కోల్పోవడం జరిగిందన్నారు. వీరిలో మన రాష్ట్రానికి చెందిన నరేంద్ర, గణేశ్ ఉన్నారన్నారు. పోలీస్ కుటుంబాల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామన్నారు. కోల్పోయిన ప్రాణాలను తిరిగి తీసుకురావడం సాధ్యం కాదని, కానీ వారి కుటుంబాలకు పోలీస్ శాఖ మొత్తం నిరంతరం అండగా ఉంటుందన్నారు. 11 రోజుల పాటు అమర వీరుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా వారి త్యాగాలను స్మరించుకుంటూ వివిధ కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. దేశ సేవకు పునరంకితమవుదామని పిలుపునిచ్చారు. ప్రకాశంనగర్ పీఎస్‌లో పనిచేస్తూ అనారోగ్యంతో మరణించిన ఏఎస్ఐ పి.శ్రీదేవి భర్త శేషు ప్రసాద్‌కి రూ.2.25 లక్షల చెక్కు, అనారోగ్యంతో మృతి చెందిన ఏఆర్ పీసీ శ్రీనివాసరావు భార్య నాగమణికి రూ.1లక్ష చెక్కును కలెక్టర్, ఎస్పీ అందజేశారు. అనంతరం పోలీసు అమర వీరుల స్థూపం వద్ద కలెక్టర్ ప్రశాంతి, జేసీ చిన్న రాముడు, ఎస్పీ నరసింహ కిషోర్, మునిసిపల్ కమిషనర్ కేతన్ గార్గ్, అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బరాజు తదితరులు నివాళులర్పించారు. ఆయా కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.





పీజీఆర్ఎస్‌లో భాగంగా కలెక్టర్‌కు సమస్యలు విన్నవిస్తున్న అర్జీదారులు.. కలెక్టర్ వేదిక ఎదుట కిందనే కూర్చుని ఉన్న దివ్యాంగులు

పీజీఆర్ఎస్‌కు దివ్యాంగుల క్యూ

రూ.15 వేల పెన్షన్‌కు పెద్ద ఎత్తున అర్జీలు

రాజమహేంద్రవరం రూరల్, అక్టోబరు 21 : క్షేత్రస్థాయి సిబ్బంది అంకితభావంతో పనిచేసి సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ పి . ప్రశాంతి ఆదేశించారు. రాజమహేంద్రవరం కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కు 144 అర్జీలు వచ్చాయి. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అర్జీలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే వారం నుంచి అర్జీదారులు నేరుగా సంబంధిత అధికారులను కలిసి అర్జీలు అందజేస్తారన్నారు. సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో రెవెన్యూ శాఖకు 58 ఫిర్యాదులు, పోలీస్ శాఖ 23, పంచాయతీ రాజ్ 16, వ్యవసాయ శాఖ 10, ఇతర శాఖలకు 37 వచ్చాయని ఆన్‌లైన్‌లో 134, ఆఫ్‌లైన్‌లో 10 అర్జీలు స్వీకరించినట్టు తెలిపారు. బొమ్మూరు చెరువుగట్టు వద్ద వాసిరెడ్డి వెంకటేశ్వరావు స్థలంలో ఏర్పాటు చేసిన వైన్ షాపును తొలగించాలని మహిళలు ఫిర్యాదు చేశారు. జాంపేట చేపల మార్కెట్ బయట కొంత మంది అల్లరి చేస్తూ మార్కెట్‌లో తమను వ్యాపారం చేసుకోనివ్వకుండా బయటకు దుకాణాలు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారని బాధిత వ్యాపారులు ఫిర్యాదు చేశారు. ధవళేశ్వరానికి చెందిన కాంట్రాక్టర్ మేకా సత్యనారాయణ పంచాయతీలో చేసిన పనులకు రూ.17 లక్షల బిల్లులు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని వాపోయాడు. బిల్లులు మంజూరు చేయకుంటే ఇక్కడే నిరాహారదీక్షకు అనుమతివ్వాలని కోరారు. పీజీ ఆర్ ఎస్‌కు రూ.15 వేల పెన్షన్‌కు అర్హత కల్పించాలని పెద్ద ఎత్తున దివ్యాంగులు తరలివచ్చారు.

డీపీవోలో గ్రీవెన్స్‌కి 28 అర్జీలు

రాజమహేంద్రవరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్(మీ కోసం)లో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు 28 అర్జీలను సమర్పించారు. వాటిని అడిషనల్ ఎస్పీ(శాంతి భద్రతలు) ఏవీ సుబ్బరాజు, స్వీకరించారు. బాధితుల సమక్షంలోనే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి తగు ఆదేశాలు ఇచ్చారు. చట్ట పరిధిలో త్వరితగతిన పరిష్కారం చూపాలని సూచించారు.

నీటి సంఘాలకు ఎన్నికలు

- ఈ నెల 31న నోటిఫికేషన్
- వచ్చే నెల 21 నుంచి ఎన్నికలు
- 29న ప్రాజెక్టు కమిటీలతో పూర్తి

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

సీఎం నారా చంద్రబాబునాయుడు మానస పుత్రిక నీటి సంఘాలకు చాలా కాలం తర్వాత ఎన్నికల షెడ్యూల్ జారీ అయింది. 1997లో చంద్రబాబు నీటి సంఘాలను ప్రవేశపెట్టి, సుమారు రూ.5లక్షలలోపు ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ పనులు చేసే హక్కును రైతులకు అప్పగించిన సంగతి తెలిసిందే. గత వైసీపీ ప్రభుత్వం నీటి సంఘాలను పూర్తిగా నిర్వీర్యం చేసింది. చంద్రబాబు నాయకత్వంలో కూటమి అధికారంలోకి రావడంతో మళ్లీ నీటి సంఘాలను తెరమీదకు తెచ్చారు.ఉభయగోదావరి జిల్లాల పరిధిలో 642 నీటి సంఘాలు ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లాలో 113 నీటి యాజమాన్య సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్-1ను జారీ చేసినట్టు జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి తెలిపారు. ముందుగా ఆయా ప్రాంతాల్లో 8 నుంచి 10 మంది వరకూ రైతులు కలిసి ప్రాదేశిక నియోజకవర్గం (టీసీ) సభ్యులను ఎన్నుకుంటారు.వారు నీటి సంఘాల ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్‌ను ఎన్నుకుంటారు. వీరు డ్రిస్టిబ్యూటరీ కమిటీలను ఎన్నుకుంటారు. ఈ కమిటీలన్నీ కలిసి ప్రాజెక్టు కమిటీలను ఎన్నుకుంటారు. వీటి ద్వారా రాజకీయ నిరుద్యోగులకు కొన్ని పదవులు దక్కు తాయి.

1,2 తేదీల్లో అభ్యంతరాల స్వీకరణ

నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్-1ను సోమవారం విడుదల చేశారు. ఈనెల 31న ప్రాదేశిక నియోజకవర్గాల వివరాలు ప్రచురిస్తారు. నవంబరు 1,2 తేదీల్లో అభ్యంతరాలు స్వీకరిస్తారు.3న అభ్యంతరాలపై నిర్ణయం తీసుకుంటారు.అదే రోజు ప్రాదేశిక నియోజకవర్గాల తుది జాబితా ప్రకటిస్తారు. 6 నుంచి 11వ తేదీ వరకూ భూయజమానుల ఓటరు జాబితా తయారు చేస్తారు. 11 నుంచి 12 వరకూ వాటిపై అభ్యంతరాలు స్వీకరిస్తారు. 13న భూయజమానుల తుది ఓటరు జాబితా ప్రకటిస్తారు. 20న ప్రాదేశిక, నీటి సంఘాలు, డ్రిస్టిబ్యూటరీ. ప్రాజెక్టు కమిటీల ఎన్నికల ప్రకటన చేస్తారు. 21 నుంచి 23వ తేదీ వరకూ ప్రాదేశికనియోజకవర్గ సభ్యులు, నీటి యాజమాన్య సంఘాల ఎన్నికలు నిర్వహిస్తారు. 24 నుంచి 26 వరకూ డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నికలు, 27 నుంచి 29వ తేదీ వరకూ ప్రాజెక్టు కమిటీ ఎన్నికలు నిర్వహిస్తారు.

పంచారామాలు, శబరిమలైకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) :పవిత్రకార్తీక మాసాన్ని పురస్కరించుకుని పంచారామాలు, శబరిమలైకు రాజమహేంద్రవరం డిపో నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నామని ఆర్టీసీ జిల్లా అధికారిణి షర్మిలా అశోక తెలిపారు. ఈ మేరకు పోస్టర్లు, బ్యానర్లను సోమవారం ఆవిష్కరించారు. రాజమహేంద్రవరం డిపో మేనేజర్ షేక్ షబ్నం మాట్లాడుతూ కార్తీకమాసంలో ప్రతి ఆదివారం సాయంత్రం 7 గంటలకు రాజమహేంద్రవరం డిపో నుంచి భక్తులతో బయలుదేరతాయన్నారు.పంచారామాల దర్శనం ఉంటుందన్నారు. ఆన్‌లైన్‌లోనూ టిక్కెట్లు రిజర్వేషన్ చేసుకోవచ్చని తెలిపారు. శబరిమలైకు సూపర్ లగ్జరీ, అల్ట్రా డీలక్స్ బస్సులు నడుపుతామని ఒక్కొక్కరికీ 5 రోజుల యాత్రకు రూ.5 వేలు, 7 రోజుల యాత్రకు రూ.6 వేలు, 10 రోజుల యాత్రకు రూ.7,500లు టిక్కెట్ ధరగా నిర్ణయించామన్నారు. యాత్రకు వెళ్లేందుకు ఆసక్తి కల్గిన వారు సెల్ : 99592 25535, 73829 12141, ఎంక్వయిరీ నెం.0883 2468625, రిజర్వేషన్ నెం.99592 25561 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఆర్టీసీ బస్ ఢీకొని దంపతుల మృతి 7

నేటి నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరాలు 8



తుఫాన్.. భయం

రాజానగరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది వరుస తుఫాను ప్రభావ పరిస్థితులతో అధిక వర్షాలు అన్నదాతలను అతలాకుతలం చేస్తున్నాయి.వరి పంట చేతికొచ్చే సమయానికి మేఘ సందేశాలు, తుఫాన్లు హెచ్చరికలు అన్నదాత గుండెల్లో గుబులు పుట్టిస్తున్నాయి. దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు కొట్టుమిట్లాడుతున్నారు.ఇప్పటి వరకూ అప్పులు చేసి పెట్టుబడులు పెట్టిన రైతులకు పంట చేతికొచ్చే సరికి అన్నదాతలు నష్టాలను చవిచూస్తున్నారు.ఓ వైపు వరుణుడి ప్రతాపం, మరో వైపు సాగులో ఖర్చుల భారంతో రైతులు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు యాంత్రీకరణ సాగు చేస్తున్నప్పటికి ప్రకృతి వైపరీత్యాల నుంచి గట్టెక్కలేకపోతున్నారు. దీపావళి సమయానికి ముసురు ప్రభావ పరిస్థితుల అనుభవాలను దృష్టిలో పెట్టుకున్న మరికొంత మంది రైతులు వరి పంట కోతకు సిద్ధంగా ఉన్నా వేచిచూస్తున్నారు. రాజానగరం మండలంలో ఈ ఏడాది 100 హెక్టార్లలో వరి సాగు చేయగా కోతలు జరుగుతున్నాయి. ముతక రకాలైన స్వర్ణ, ఎంటీయూ 1318 ఇంకా కోతకు దశకు చేరుకోలేదు.

కొబ్బరి చెట్టుపై పిడుగు

కొవ్వూరు,అక్టోబరు 21 (ఆంధ్ర జ్యోతి) : కొవ్వూరులో పిడుగు పడి కొబ్బరిచెట్టుపై మంటలు ఎగసిపడ్డాయి. 22వ వార్డు పోతురాజు దిబ్బ లో సోమవారం మధ్యాహ్నం కొబ్బరిచెట్టుపై పిడుగు పడింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మం టలను అదుపుచేశారు.



తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

నేడు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో జాబ్‌మేళా

కొవ్వూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో 22న కొవ్వూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి శాఖాధికారి గంటా సుధాకర్, కళాశాల ప్రిన్సిపాల్ జె.సునీత తెలిపారు. జాబ్‌మేళాలో పాల్గొనే అభ్యర్థులు ఐటీఐ, డిప్లొమా, ఏదైనా డిగ్రీ, బీఎస్సీ కెమిస్ట్రీ, బిఫార్మసీ, ఎంఫార్మసీ, పీజీ విద్యార్థులు అర్హులన్నారు. వివరాలకు 73062 32373లో సంప్రదించాలన్నారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కిడ్నీ బాధితురాలికి ఆర్థికసాయం

కొవ్వూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న మహిళకు నియోజకవర్గ మాదిగ సోదరుల ఫెడరేషన్ సభ్యులు ఆర్థిక సాయం అందించారు. రాజమహేంద్రవరం బొల్లినేని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కె.ఝాన్సీ వైద్యం నిమిత్తం జిల్లా ఉద్యోగ, ఉపాధ్యాయ ఫెడరేషన్, నియోజకవర్గ మాదిగ సోదరుల ఫెడరేషన్ సభ్యులు బాధితురాలి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహకారం అందజేశారు. కార్యక్రమంలో పెనుమాక జయరాజు, మెరుపు జలమయ్య, మధుశేఖర్, గెల్లా రాజు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరాలు

కొవ్వూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు పురపాలక సంఘం పరిధిలో నేటి నుంచి 25 వరకు ఆధార్ ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్ర కుమార్ తెలిపారు. మంగళవారం 1వ వార్డు శ్రీరామకాలనీ సచివాలయం, 23న ప్రభుత్వ జూనియర్ కళాశాల, 24న పీఎంఎంఎం మున్సిపల్ హైస్కూల్, 25న ఇందిరమ్మకాలనీ 9వ సచివాలయంలో ఆధార్ శిబిరాలు జరుగుతాయన్నారు. ఆధార్ డాక్యుమెంట్స్ నవీకరణకు నేటి నుంచి 25 వరకు ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కె.సుశీల తెలిపారు. నేడు వాడపల్లి 1వ సచివాలయం, పెనకనమెట్ట, వేములూరు, పంగిడి 1వ సచివాలయాలు, 23న వాడపల్లి, బంగారంపేట, దొమ్మేరు సావరం, వేములూరు, పంగిడి 1వ సచివాలయం, 24న మద్దూరు, దొమ్మేరు, తోగుమ్మి, ధర్మవరం గ్రామ సచివాలయాలు, 25న తోగుమ్మి, దొమ్మేరు, నందమూరు, కాపవరం గ్రామ సచివాలయాల్లో ఆధార్ నవీకరణ శిబిరాలు నిర్వహిస్తున్నామని ఎంపీడీవో సుశీల తెలిపారు.

చాగల్లులో: మండలంలో ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో ఆర్.శ్రీదేవి తెలిపారు. శని, ఆదివారాలు చాగల్లు హైస్కూల్, ఎంపీపీ షుగర్ ఫ్యాక్టరీ స్కూల్‌తోపాటు, బ్రాహ్మణగూడెం, ఎస్.ముప్పవరంలోను ఆయా సచివాలయాల వద్ద జరుగుతాయన్నారు. గురువారం మీనానగరం, నెలటూరు, చంద్రవరం, మార్కొండపాడు సచివాలయాల వద్ద, 25న మీనానగరం, నెలటూరు, మల్లవరం, మార్కొండపాడు సచివాలయాల వద్ద ఆధార్ శిబిరాలు జరుగుతాయని తెలిపారు. కొత్త ఆధార్ కార్డులు, చిరునామా మార్పు, ఫోన్ నెంబర్ లింక్ వంటి సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థి రాజశేఖర్‌ను పరిచయం చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

పట్టభద్రుల ఎన్నికల్లో అధిక మెజార్టీ సాధించాలి

కొవ్వూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల్లో నియోజకవర్గం నుంచి అత్యధిక మెజార్టీ తీసుకురావాలని ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ, జిల్లా పరిశీలకుడు వెంపాడ్ చిరంజీవి అన్నారు. సోమవారం టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరావు అధ్యక్షతన ఎన్డీఏ భాగస్వామ్య పక్ష నాయకుల సమావేశం నిర్వహించారు. పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను కూటమి నాయకులకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ చిరంజీవి మాట్లాడారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి టీవీ రామారావు, నియోజకవర్గ పరిశీలకుడు గొర్రెల శ్రీధర్, ద్విసభ్య కమిటీ సభ్యుడు కంటమణి రామకృష్ణారావు, ఎంపీపీ కాకర్ల నారాయుడు, అర్బన్ బ్యాంకు చైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ, పట్టణ అధ్యక్షుడు దాయన రామకృష్ణ, సూరపనేని చిన్ని, మండల అధ్యక్షుడు వట్టికూటి వెంకటేశ్వరరావు, బీజేపీ నాయకులు బోడపాటి ముత్యాలరావు, టీడీపీ నాయకులు మద్దిపాటి సత్యనారాయణ, మేకల శ్రీను, జొన్నలగడ్డ శ్రీనివాస్, చావా శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆలోచన విరమించుకోవాలి

కొవ్వూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆలోచన విరమించుకోవాలని మాల సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ బొంతా శ్యాంరవిప్రకాష్ డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు నినాదంతో స్టీల్‌ప్లాంట్ సాధించిన అమరజీవి టి.అమృతరావు 103వ జయంతికి శుభాకాంక్షలు తెలిపారు. 32 మంది ప్రాణాలు త్యాగం చేసి సాధించిన స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేయాలనుకోవడం దుర్మార్గమన్నారు. కేంద్ర ప్రభుత్వం 38 వేల కోట్ల బడ్జెట్ కేటాయించి కార్మికులను ఆదుకోవాలన్నారు. ఎన్నికల ముందు విశాఖ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్, ఎంపీ భరత్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటుపరం కాకుండా చర్యలు తీసుకుంటామని చెప్పి 120 రోజులు పూర్తయినా దీని ఊసెత్తకపోవడం బాధాకరమన్నారు.

లాబ్ టెక్నీషియన్ల సేవలు ఎనలేనివి

» మంత్రి కందుల దుర్గేష్ » రాజమహేంద్రవరంలో 'డయాగ్నోకాన్-2024'



మంత్రి దుర్గేష్‌ను సత్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

రాజమహేంద్రవరం కల్చరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కొవిడ్ సమయంలో ల్యాబ్ టెక్నీషిన్లు ఎనలేని సేవలందించారని, వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ చెప్పారు. రాజమండ్రి ల్యాబ్ టెక్నీషియన్ల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తూర్పుగోదావరి జిల్లా డయాగ్నోకాన్-2024 కార్యక్రమం హోటల్ షెల్టన్‌లో జరిగింది. అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కొక్కి రి కిరణ్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ము ఖ్యఅతిథులుగా మంత్రి దుర్గేష్‌తోపాటు ఎమ్మెల్యే లు ఆదిరెడ్డి వాసు, బత్తుల బలరామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు విచ్చేశారు. ఎమ్మెల్యే బత్తుల మాట్లాడుతూ అసోసియేషన్ భవన నిర్మాణానికి స్థలం కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ల్యాబ్ టెక్నీషియన్లకు ప్రభుత్వం భరోసా కల్పిస్తుందని ఎమ్మెల్యే వాసు ఆదిరెడ్డి అన్నా రు. సుమారు 300 మంది ల్యాబ్ టెక్నీషియన్లు హాజరైన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి రాజేష్, భాను ప్రకాష్, నానిబాబు, బాషా, యువరాజు, నవీన్, బషీర్ పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత బస్సు హామీ నెరవేర్చాలి

రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదుట కాంగ్రెస్ శ్రేణుల ధర్నా



ఆర్టీసీ బస్‌కాంప్లెక్ ఎదుట ధర్నా చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం హామీని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం రాజమహేంద్రవరంలోని ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ ఎదుట జిల్లా కాంగ్రెస్ కమిటీ, జిల్లా మహిళా కాంగ్రెస్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి నాయకులు ఇచ్చిన మాట మేరకు ఉచిత బస్సు హామీ నెరవేర్చాలని కోరారు. ఈ మేరకు ప్రతి నియోజకవర్గం నుంచి వెయ్యి పోస్టుకార్డులతో ఉద్యమానికి శ్రీకారం చుడతామన్నారు. పీసీసీ అధికార ప్రతినిధి అమర్ జహబేగ్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ కూటమి ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి అరుణకుమారి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు మోత శారద, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు మురళీధర్, వడయార్ తదితరులు పాల్గొన్నారు.



రాజమహేంద్రవరంలో రాత్రి గస్తీ పెంపు

ఏడు ప్రత్యేక బృందాలు ఏర్పాటు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అసాంఘిక శక్తులను, కార్యకలాపాలను అణచివేసేందుకు జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ ఏడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సోమవారం రాత్రి ఆయా బృందాలకు ఆయన ఆదేశాలు జారీచేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రాజమహేంద్రవరం అర్బన్ పరిధిలో అసాంఘిక శక్తులపై ప్రత్యేక బృందాల ద్వారా ఉక్కుపాదం మోపుతామన్నారు. అర్బన్‌లో ఆరు ప్రత్యేక బృందాలు, ఒక మహిళా రక్షిత బృందం రాత్రి వేళలో పెట్రోలింగ్‌ను పటిష్టంగా చేస్తాయన్నారు. బృందాలకు దిశనిర్దేశం చేశారు.



కొవ్వూరు పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న కొవ్వూరు పట్టణ, రూరల్ పోలీసులు



తాళ్లపూడి బస్టాండు వద్ద ర్యాలీలో పాల్గొన్న పోలీసులు, గ్రామస్థులు



చాగల్లులో పోలీసుల అమరవీరుల సంస్మరణ ర్యాలీలో పాల్గొన్న ఎస్ఐ నరేంద్ర

పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

కొవ్వూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని కొవ్వూరు డీఎస్పీ జి.దేవప్రసాద్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం పోలీస్‌స్టేషన్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు పోలీసులు పట్టణంలో ర్యాలీ జరిపారు. బస్టాండ్ సెంటర్‌లో పోలీసులు, విద్యార్థులు మానవహారంగా ఏర్పడి అమరవీరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో కొవ్వూరు సీఐ పి.విశ్వం, రూరల్ సీఐ కె.విజయబాబు, ఎస్ఐ కె.జగన్మోహనరావు, ఏఎస్ఐ జీజీ ప్రకాష్, జె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చాగల్లు: ప్రజలకు భద్రత కల్పించడంలో పోలీసుల సేవలు మరువలేనివని ఎస్ఐ కే. నరేంద్ర అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. హైస్కూల్ నుంచి సెంటర్ వరకు ర్యాలీ జరిపి పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు పి.వీర్రాజు, పాఠశాల విద్యార్థులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్ఐ టి.రామకృష్ణ ఆధ్వర్యంలో బస్టాండు సెంటరు నుంచి మార్కెట్ వరకూ ర్యాలీ జరిపారు. ముందుగా విధి నిర్వహణలో అశువులుబాసిన పోలీసు అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించి ర్యాలీ జరిపారు. ప్రజలకు భద్రత కల్పించడంలో పోలీసుల సేవలు మరువలేనివని వక్తలు తెలిపారు. కార్యక్రమంలో పోలీసులు, గ్రామస్థులు, ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.

నిడదవోలు: స్థానిక గణపతి సెంటరు వద్ద ఉన్న ఐ లవ్ నిడదవోలు సర్కిల్ వద్ద స్థానిక ఎస్ఐ పసుపులేటి శోభన్‌కుమార్ ఆధ్వర్యంలో పట్టణ పోలీసులు విద్యార్థులతో కలిపి మానవహారం నిర్వహించి అమరులైన పోలీస్ కుటుంబాలకు నివాళులర్పించారు. అనంతరం పట్టణంలోని మెయిన్‌రోడ్డులో ర్యాలీ నిర్వహించారు.

నల్లజర్ల: పోలీసుల అమరవీరుల దినోత్సవం నల్లజర్లలో నిర్వహించారు. గ్రామంలో విద్యార్థులతో కలిసి మానవహారం ఏర్పాటు చేసి నివాళులర్పించారు. సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎందరో పోలీసుల ప్రాణత్యాగాలు దేశాన్ని రక్షిస్తున్నాయన్నారు.



నిడదవోలులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, పోలీసులు



నల్లజర్లలో అమర వీరులకు నివాళులర్పిస్తున్న పోలీసులు

ప్రజల కోసమే గ్రీవెన్స్‌సెల్

కొవ్వూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కార వేదికగా మంగళగిరిలో గ్రీవెన్స్‌సెల్ నిర్వహిస్తున్నట్లు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మాజీ మంత్రి కెఎస్ జవహర్ అన్నారు. సోమవారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన 41 మంది ఎమ్మార్సీ రిసోర్స్‌పర్సన్‌లు సోమవారం ఆయన్ను కలిశారు. రీసోర్స్‌పర్సన్‌లు మాట్లాడుతూ గ్రీవెన్స్‌లో తమ సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరించారన్నారు. ఈ సందర్భంగా జవహర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపామన్నారు. జవహర్ మాట్లాడుతూ రీసోర్స్‌పర్సన్‌ల సమస్యలు తెలుసుకుని వారికి ఉపాధి కల్పించామన్నారు. ఈ సందర్భంగా ఆయన్ను రీసోర్స్‌పర్సన్‌లు సత్కరించారు.



టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శిని సత్కరిస్తున్న ఎమ్మార్సీ రీసోర్స్‌పర్సన్‌లు



ఆసుపత్రిలో పిడుగుపాటు బాధితులకు పండ్లు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే తలారి

పిడుగుపాటు బాధితులకు సాయం

కొవ్వూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుకు గురైన పెనకనమెట్ట వాసులను గోపాలపురం మాజీ ఎమ్మెల్యే కొవ్వూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు సోమవారం పరామర్శించారు. కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులకు నగదుతో పాటు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కంటమణి రమేష్‌బాబు, సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

ఎస్ఐ బాధ్యతల స్వీకరణ



పెరవలి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పెరవలి ఎస్ఐ గా ఎం.వెంకటేశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన అప్పారావు ఒక కేసు విషయంలో ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. దీంతో భీమవరం నుంచి వెంకటేశ్వరరావు బదిలీపై వచ్చారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు రాకేష్ ఎంపిక



రాకేష్‌తో ఉపాధ్యాయులు

నిడదవోలు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): నిడదవోలులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న దాసరి రాకేష్ ఏలూరులో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి యోగా పోటీల్లో ప్రథమస్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయుడు యు.గురునాథం తెలిపారు. నెల్లూరులో జరిగే రాష్ట్ర పోటీల్లో రాకేష్ పాల్గొంటాడన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని ఉపాధ్యాయులు అభినందించారు.

చర్చిపేటలో సామూహిక మరుగుదొడ్లను తొలగించాలి

నిడదవోలు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): నిడదవోలులోని చర్చిపేట 7వ నెంబరు సచివాలయం వద్ద ఉన్న సామూహిక మరుగుదొడ్లను తొలగించాలంటూ సోమవారం చర్చిపేట యూత్ ధర్నా నిర్వహించింది. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ జువ్వల రాంబాబు మాట్లాడుతూ చర్చిపేట సెంటరులో ఉన్న సామూహిక మరుగుదొడ్లను తొలగించి ఆ స్థానంలో విద్యార్థులకు ఉపయోగపడేలా గ్రంథాలయం నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో యు.మోషే, ఎల్లే పండు, మద్రిపూడి రాజేష్, దాకే సతీష్, నల్లా రాంబాబు పాల్గొన్నారు.

వైభవంగా మహా కుంభాభిషేకం



శత చండీ యాగంలో పాల్గొన్న భక్తులు

తాళ్లపూడి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): తాళ్లపూడిలోనున్న కనకదుర్గ ఆలయంలో మహా కుంభాభిషేకం, శత చండీయాగం కార్యక్రమాలకు సోమవారం నుంచి శ్రీకారం చుట్టారు. యాగానికి ప్రత్యేకంగా నిర్మించిన యాగశాలలో అమ్మవారిని ప్రతిష్ఠించి యాగశాల ప్రవేశం, గణపతిపూజ, గోపూజ, పుణ్యాహ వచన, దీక్షధారణ కార్యక్రమాలు జరిపారు. ఆలయ ధర్మకర్త నీలి సూర్యనారాయణ మాట్లాడుతూ మంగళవారం 108 దంపతులతో శతచండీ, దశ మహాదేవి హోమాలు జరుగుతాయన్నారు. సాయం త్రం పద్మశ్రీ గరికపాటి నరసింహారావు ప్రవచ నాలు జరుగుతాయని తెలిపారు. బుధవారం దుర్గా మల్లేశ్వరస్వామి శాంతి కల్యాణం జరు పుతారని మధ్యాహ్నం నుంచి అన్న సమారా ధన జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాలు సిద్ధేశ్వర, కార్తికేయ ఆచార్యత్వంలో అర్చకుడు అల్లూరి శివ ప్రసాద్‌శర్మ అధ్వర్యంలో జరుగ నున్నట్టు తెలిపారు.

26న ఆర్ట్స్ కళాశాలలో మెగా జాబ్ మేళా

ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్స్‌లో ఈనెల 26న మెగా జాబ్ మేళను ఏర్పాటు చేస్తున్నానని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. సోమవారం రాజమహేంద్రవరం తిలక్‌రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యువతను చెడు వ్యసనాల నుంచి దూరం చేసేందుకు కృషి చేస్తున్నామని, ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. ఇప్పటికే సోషల్ మీడియాలో తాము పెట్టిన పోస్టింగ్‌లకు నిరుద్యోగులు స్పందించి 4వేల మందిపైబడి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని చెప్పారు. తన సొంత ఖర్చులతో ఈ జాబ్ మేళా ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. డివిజన్ల వారీగా తాము కరపత్రాలు పంపించామని వాటిలో ఉన్న క్యూఆర్‌కోడ్‌ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. టెన్త్, ఇంటర్, ఐటిఐ డిగ్రీ, ఇంజనీరింగ్ చదువుకున్నవారు ఎంతమంది వస్తారో దానిని బట్టి ఉద్యోగవకాశాలు ఉంటాయన్నారు. రాజమహేంద్రవరాన్ని ఐటీ హబ్‌గా తీర్చిదిద్దుతామన్నారు. స్థానిక ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ప్రక్షాళణ చేయకతప్పదన్నారు. మెరుగైన వైద్యసేవలు ప్రజలకు అందాలన్నారు. మెడికల్ కళాశాలలో పరికరాలు, మౌలిక సదుపాయాలు, కల్పించేందుకు రూ.80నుంచి 90 కోట్లు నిధులు వస్తున్నాయని, అనాటమీ ప్రొఫెసర్ నియమితులయ్యారని తెలిపారు. సమావేశంలో టీడీపీ పార్లమెంట్ డాక్టర్స్ సెల్ అధ్యక్షుడు యాళ్ల ప్రదీప్, నక్కా దేవివరప్రసాద్, యిన్నమూరి దీపు, శెట్టి జగదీష్, ఉర్లంకల లోకేష్, చింతపల్లి నాని, మునిని బాబురావు, చాలప చిన్నరాజు, సాయిదీపక్ పాల్గొన్నారు.

అదుగో చిరుత!

» ట్రాప్ కెమెరాకు చిక్కిన చిరుత » బోన్లు ఏర్పాటు చేసిన అటవీశాఖ అధికారులు

» ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ హెచ్చరికలు



ఎం.నాగులపల్లి శివారు అందాలమ్మ చెరువు ప్రాంతంలో ట్రాప్ కెమెరాకు చిక్కిన చిరుత

ద్వారకా తిరుమల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎం.నాగులపల్లి శివారులో రెండురోజుల క్రితం కన్పించి ప్రజలను బెంబేలెత్తించిన చిరుత.. ఫారెస్ట్ అధికారులు ఏర్పాటు చేసిన ట్రాప్ కెమెరాకు చిక్కింది. అది ఆ పరిసర ప్రాంతాల్లోనే మకాం వేసినట్టు అనుమానిస్తున్నారు. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. సోమవారం ఉదయం ట్రాప్ కెమెరాలో చిరుత సంచారం నమోదు కావడంతో దానిని పట్టుకునేందుకు ప్రత్యేక బోన్లు ఏర్పాటు చేశారు. పరిసర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే చిరుత సంచా రాన్ని ఖరారు చేసేందుకు ఆ ప్రాంతంలో దొరికిన దాని పాదముద్రలను ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ వినియోగించి నమూనాలను తయారు చేశారు. వీటిని ల్యాబ్‌లో పరిశీలించేందుకు అటవీ శాఖ రేంజర్ రాజమండ్రికి పంపారు. ఈ క్రమంలోనే ట్రాప్ కెమెరాకు చిరుత సంచారం జాడ కన్పించడంతో అప్రమత్తమైన జిల్లా అటవీ శాఖ అధికారి ఆశాకిరణ్ సోమవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రస్తుతం అందుబా టులో ఉన్న ట్రాప్ కెమెరాలను అదనంగా మరో రెండు కెమెరాలను చిరుత జాడ కన్పించిన అందాలమ్మ చెరువు ప్రాంతంలో ఏర్పాటు చేశారు.



ఫిర్యాదులు తీసుకుంటున్న ఆర్డీవో రాణి సుస్మిత

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఫిర్యాదులు

కొవ్వూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మూడు ఫిర్యాదులు వచ్చినట్టు ఆర్డీవో రాణి సుస్మిత తెలిపారు. కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో సోమవారం డివిజనల్ స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ప్రజల ఫిర్యాదులను తక్షణం పరిష్కరించాలని అధికారులకు ఆమె సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయ ఏవో జీఎస్ఎస్ జవహర్ బాజి, ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు అవగాహన



మాట్లాడుతున్న ఎంపీపీ దుర్గారావు

దేవరపల్లి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): దేవరపల్లిలో పశువుల షెడ్లకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీపీ కేవీకే దుర్గారావు మాట్లాడుతూ పశువుల షెడ్లు మంజూరైన లబ్ధిదారులంతా త్వరగా పూర్తి చేసుకోవాలన్నారు. వీటి నిధులు విడతల వారీగా బ్యాంకు ఖాతాలో జమ చేస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వేణుగోపాలరెడ్డి, ఏపీవో శ్రీనివాసరావు, టెక్నికల్ అసిస్టెంట్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

రేపు ఆర్ట్స్ కళాశాలలో దివీస్ ల్యాబ్స్ క్యాంపస్ సెలక్షన్స్

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఈనెల 23వ తేదీన దివీస్ ల్యాబ్స్ వారితో క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే ఒక ప్రకటనలో తెలిపారు. ట్రైనీ సూపర్‌వైజర్లు, గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేస్తారని, 2020-2024 సంవత్సరాల్లో డిగ్రీ పూర్తిచేసిన బీఎస్సీ కెమిస్ట్రీ, బీ.ఫార్మసీ, ఎంఎస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ, అనలిటికల్ కెమిస్ట్రీ, ఎం-ఫార్మసీ, బీటెక్ కెమికల్ అర్హత కల్గిన విద్యార్థులు అర్హులని తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్న వారు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, జెరాక్సులతో హాజరుకావచ్చని కళాశాల జేకేసీ కో ఆర్డినేటర్ హరినాథరెడ్డి తెలిపారు.

విద్యార్థిని మృతికి సంతాపం

దివాన్‌చెరువు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విద్యార్థిని కుంచె పల్లవి మృతి ఆమె కుటుంబానికి, తోటి విద్యార్థులకు, అధ్యాపకులకు తీరని లోటు అని ఉపకులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు అన్నారు. విశ్వవిద్యాలయంలో సోమవారం జరిగిన సంతాపసభలో పల్లవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు, వర్సిటీ సిబ్బంది రోడ్లపై జాగ్రత్తగా ప్రయాణించాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ప్రిన్సిపాల్ పి.విజయనిర్మల, వర్సిటీ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని పల్లవి ఆత్మశాంతి కోసం కొద్దిసేపు మౌనం పాటించారు.

శనగ విత్తనాల పంపిణీ

రంగంపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రైతులను ఆర్థికంగా అభివృద్ధి చేయాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. మండలం కె.కోటపాడులో సోమవారం రాయితీపైశనగ విత్తనాలు పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని, రైతులకు రాయితీపై ఎరువులు, విత్తనాలు, యంత్రాలను అందిస్తున్నామన్నారు.

పుల్లా కుటుంబానికి పరామర్శ

కడియం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సత్యదేవా నర్సరీ అధినేత పుల్లా చంటియ్య ఇటీవల మృతి చెందారు. చంటియ్య సోదరుడు పుల్లా అబ్బులు, కుమారుడు పెదసత్యనారాయణ, పుల్లా వీరవెంకట్రావు, చినసత్యనారాయణ, వీర్రాజు, రామకృష్ణ, శ్రీకాంత్‌లను సోమవారం ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజాలు వేర్వేరుగా పరామర్శించారు. చంటియ్య చిత్రపటం వద్ద పూలు వేసి నివాళులర్పించారు. అలాగే రావిపాటి రామచంద్రరావు, గట్టి సుబ్బారావు తదితరులు పుల్లా కుటుంబాన్ని పరామర్శించారు.

సినిమా గైడ్

కొవ్వూరు	
యువరాజ్‌మాల్ స్క్రీన్1	: వేట్టయన్
వై.స్క్రీన్2	: విశ్వం
దేవిశ్రీ(గాయత్రి	: మార్టిన్
అనన్య	: దేవర
నిడదవోలు	
వీ మ్యాక్స్	: దేవర
రాధాకృష్ణ	: వేట్టయన్
శ్రీగణపతి	: విశ్వం
దేవరపల్లి	
శ్రీరామ్‌నాథ్ సినీ మ్యాక్స్	: దేవర
త్రినాథ్ సినీ మ్యాక్స్	: దేవర